

స్టాంపులకు కటకట

- వైసీపీ ప్రభుత్వంలో ఆగిన బిల్లులు
- ముద్రణా సంస్థల నుంచి సరఫరా బంద్
- సాంకేతిక సమస్యతో తపాలా శాఖవి మూలకు...
- ఈ-స్టాంపింగ్ ఉన్నా అనాసక్తి
- రిజిస్ట్రేషన్‌దారులకు ఇక్కట్లు
- ఆందోళనకు దిగిన రైటర్లు
- కొంతకాలంగా నాన్ జుడీషియల్ స్టాంపులకు తీవ్ర కొరత



జిల్లాలో రిజిస్ట్రేషన్లకు అవసరమైన నాన్ జుడీషియల్ స్టాంపు కాగితాల కొరత తీవ్రంగా ఉంది. ఇటీవల ఆ స్టాంపులు అసలు దొరకటం లేదు. జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అందుబాటులో లేవు. ముఖ్యంగా రూ.100 విలువగల స్టాంపులకు మరింత కొరత ఏర్పడింది. సాధారణంగా భూములు, ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్‌కు ఎక్కువ మంది రూ.100, రూ.50ల స్టాంపులనే ఎంచుకుంటారు. అయితే రూ.లక్షలు, రూ.కోట్లు వెచ్చించి భూములు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకునే వారు అవసరమైన స్టాంపులు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. ఫలితంగా దస్తావేజుల తయారీ కష్టతరంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం స్టాంపు కాగితాల ముద్రణ సంస్థలకు బిల్లులు చెల్లించకపోవడంతో స్టాంపుల కొరత ఏర్పడిందన్న వాదన వినిపిస్తోంది.

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 30 : స్థిరాస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి ఆస్తుల వివరాల నమోదుకు రూ.100, రూ.50, రూ.20, రూ.10 స్టాంపు కాగితాలను వాడుతుంటారు. ప్రతి లక్ష రూపాయల స్టాంపు డ్యూటీకి రూ.600కు తగ్గకుండా స్టాంపులు వినియోగిస్తుంటారు. ఈ లెక్కన జిల్లాకు లక్షలాది నాన్ జుడీషియల్ స్టాంపుల అవసరం ఉంది. జిల్లాకు నాలుగు దఫాలుగా అవసరాన్ని బట్టి స్టాంపులు రావాల్సి ఉంది. రూ.100, రూ. 50 స్టాంపు లను గతంలో తెలుగుదేశం ప్రభుత్వం మహారాష్ట్రలోని నాసిక్ ముద్రణ సంస్థ నుంచి తెప్పిం చింది. రూ.20, రూ.10 స్టాంపులను తెలంగాణలోని ముద్రణ సంస్థ నుంచి కొనుగోలు చేసేది. వీటి విక్రయాల ద్వారా వచ్చిన మొత్తాన్ని సీఎఫ్‌ఎంఎస్‌లో జమ చేసేవారు. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం సీఎఫ్‌ఎంఎస్‌లో జమ అయిన కోట్లాది రూపాయలను నాసిక్‌లోని ముద్రణ సంస్థలకు చెల్లింపులు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక రిజిస్ట్రేషన్ శాఖలో జమైన మొత్తాన్ని కూడా ఉచిత పథకాలకు దారి మళ్లించిందనే విమర్శలు వెల్లువెత్తాయి. దీనికితోడు ఈ-స్టాంపింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టి నాన్ జుడీషియల్ స్టాంపుల కొనుగోళ్లకు మంగళం పాడింది. దీంతో రూ. 100, రూ.50 స్టాంపులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అందటం లేదు.

అఫిడవిట్లకూ తప్పనిసరి

జనన, మరణ, ఇతర గుర్తింపు పత్రాల కోసం అభ్యర్థులు ప్రభుత్వానికి ఇచ్చిన వివరాలు వాస్తవమేనని ధ్రువీకరిస్తూ రూ.100 స్టాంపు కాగితం మీద అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాలో రూ.100 స్టాంపుల కొరత కారణంగా ఇతర జిల్లాల్లో అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేసి తేవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బ్లాక్ మార్కెటింగ్

జిల్లాలో భూములు, స్థలాలు, ఇతరత్రా రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ రూపేణా ఏటా రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. అయితే కొంత కాలంగా స్టాంపు కాగితాల కొరత ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడుతోంది. ఈ-స్టాంపింగ్ విధానం ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్‌దారుల్లో ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. ఇదే అదునుగా కొందరు బ్లాక్ మార్కెటింగ్‌కు తెరలేపారు. ముందుగానే కొనిపెట్టుకున్న స్టాంపులను అధిక ధరకు విక్రయిస్తున్నారు. రూ.50 స్టాంపు కాగితాన్ని రూ.200 వరకు బ్లాక్‌లో అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలోని అన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నాన్ జుడీషియల్ స్టాంపులను సరఫరా చేసి కొరతను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మూలనపడ్డ స్టాంపులు

గత వైసీపీ ప్రభుత్వంలో పోస్టాఫీసుల్లో నాన్ జుడీషియల్ స్టాంపుల అమ్మకాలు ప్రవేశ పెట్టారు. అయితే సదరు స్టాంపులను పోస్టాఫీసుల్లో పెద్దగా ఎవరూ కొనుగోలు చేయలేదు. దీంతో తపాలా శాఖ స్టాంపులను రిజిస్ట్రేషన్ శాఖకు తిప్పి పంపినట్లు తెలి సింది. ఈ స్టాం పులను అందుబాటులోకి తేవడానికి సాంకేతిక సమస్య ఉన్నట్లు సమాచారం. ఈ కారణంగా అవి నిరుపయోగంగా మూలనపడ్డాయి.

రైటర్ల ఆందోళన

జిల్లాలో నాన్ జుడీషియల్ స్టాంపుల కొరతను తీర్చాలని కోరుతూ డాక్యుమెంటు రైటర్లు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనే యులుకు వినతిపత్రం సమర్పించారు. దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడుతూ ఆస్తుల క్రయ, విక్రయదారులు నాసిక్ నుంచి నెల్లూరుకు వస్తున్న నాన్ జుడీషియల్ స్టాంపులనే అడుగుతున్నా రని, ఈ-స్టాంపింగ్‌ను ఎవరూ ఇష్టపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ జుడీషియల్ స్టాంపులను వెంటనే తెప్పించాలని కోరారు. లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు ఊసా శ్రీనివాసులు, రాజు, పంచాగ్నుల పవన్‌కుమార్, అనూష, స్టాంపు వెండర్లు పాల్గొన్నారు.

స్టాంపులు కావాలని కోరాం

జిల్లాలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జుడీషియల్ స్టాంపుల కొరత ఉంది.. వినియోగం ఎక్కువగా లేని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి వినియోగం ఎక్కువగా ఉన్న చోటుకి స్టాంపులను తెప్పిస్తున్నాం. అదనంగా స్టాంపుల కోసం రాష్ట్ర కార్యాలయానికి ఇండెంటు పెట్టాం. ఈ-స్టాంపింగ్ విధానాన్ని రిజిస్ట్రేషన్లకు వినియోగిస్తున్నాం. అఫిడవిట్లకు కూడా దీనిని వాడుకోవచ్చు.

- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ



స్టాంపులు తెప్పించాలని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులును కోరుతున్న డాక్యుమెంటు రైటర్లు

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం) : ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేస్తారు. సెప్టెంబరు 1న ఆదివారం సెలవు కావటంతో ఒక రోజు ముందుగానే శనివారమే పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించి నిధులు విడుదల చేసింది. జిల్లాలో 3.12 లక్షల మంది పింఛనుదారులకు రూ.132.30 కోట్ల పింఛను సొమ్ము విడుదలైంది. లబ్ధిదారులు ఇళ్ల వద్దనే అందుబాటులో ఉండి పింఛను తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో కోరారు. శనివారం తీసుకోలేకపోయిన వారికి సోమవారం అందచేస్తారని తెలిపారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా హరికిరణ్

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 30 : జిల్లాకు ప్రత్యేకాధికారిగా చెవ్వూరు హరికిరణ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హరికిరణ్ ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. జిల్లాకు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఆయన జిల్లా యం త్రాంగంతో కలిసి ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు తీరును పర్య వేక్షిస్తారు.



వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ దృశ్యాలను తిలకిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్, తదితరులు



చిరకాల స్వప్నం.. నెరవేరిన వేళ!

- మత్స్యకారులకు అందుబాటులోకి ఫిషింగ్ హార్బర్
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- కలెక్టరేట్‌లో శిలాఫలకం ఆవిష్కరణ

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 30 : మత్స్యకార జీవితాల్లో వెలుగులు నింపే వారి చిరకాల స్వప్నమైన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. దేశంలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి మహారాష్ట్రలోని పాలఘర్ నుంచి వర్చువల్‌గా ఈ హార్బర్‌ను ప్రారంభించి మత్స్యకారులకు అంకితమిచ్చారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కావలి ఎమ్మెల్యే డి.వి.కృష్ణారెడ్డి అధ్యక్షతన మంత్రి పొంగూరు నారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, విజయవాడ మెరైన్ జేడీ వి.వెంకటేశ్వరరావు, కలెక్టర్ ఓ.ఆనంద్, జేసీ కార్తీక్, మత్స్య శాఖ జేడీ ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొని హార్బర్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కృష్ణపట్నం గూడ్స్ హార్బర్ నిర్మాణం వల్ల నష్టపోయిన మత్స్యకారులను ఆదుకునేందుందుకు టీడీపీ అధికారంలో హార్బర్ నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభించారు. స్థల సేకరణ కూడా పూర్తిచేయడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కేటాయింపులతో రూ.288.8కోట్ల అంచనాలతో ప్రణాళికలు రూపొందించారు. కేంద్ర మత్స్య శాఖ రూ.69.145 కోట్లు, కేంద్ర షిప్పింగ్ శాఖ రూ.69.145కోట్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.150.51కోట్లు విడుదల చేశాయి. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 10 హార్బర్లలో జువ్వలదిన్నె హార్బర్ అంతర్జాతీయ ప్రమాణాలు, సౌకర్యాలలో ప్రథమ స్థానంలో ఉందని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు.

25 వేల కుటుంబాలకు లబ్ధి

జిల్లాలో హార్బర్ ఏర్పాటు వల్ల దాదాపుగా 25వేల మత్స్యకార కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూరనుంది. యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం కూడా ఉంది. ఈ హార్బర్‌లో దాదాపు 1250 బోట్లను నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అంతేగాక వలల నిల్వ, రిపేరు షెడ్లు, బోటు, ఇంజన్ మరమ్మతుల సౌకర్యాలు ఉంటాయి. మత్స్యకారులకు ప్రత్యేకంగా కమ్యునిటీ హాలు, క్యాంటీన్, వెయిటింగ్ హాలు, డార్మిటరీ, మంచినీరు, కస్టం హైరింగ్ సెంటర్లు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఓ పెట్రోలు బంకు కూడా అందుబాటులోకి రానుంది. కోల్డ్ స్టోరేజీ, చేపల వేలం కోసం ఆక్షన్ హాల్, ట్యూనా చేపల నిల్వ ఎగుమతుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తారు. మత్స్యకార మహిళల ఉపాధికి ఎండు చేపల తయారీ కేంద్రాలు, ప్రాసెసింగ్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొస్తారు.

పారిశ్రామికవాడలా కావలి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రామాయపట్నం పోర్టు నిర్మాణం, ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణంతో కావలి నియోజకవర్గం త్వరలోనే పారిశ్రామిక వాడలా అవతరిస్తుందని ఎమ్మెల్యే డి.వి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. హార్బర్ నిర్మాణం ద్వారా దాదాపు 40వేల టన్నుల మత్స్య సంపదను వెలికి తీయవచ్చని చెప్పారు. హార్బర్ ఆధారిత పరిశ్రమలు త్వరలోనే వస్తాయన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా స్థానిక మత్స్యకారులు గ్రూపుగా ఏర్పడితే కేవలం 10శాతం లబ్ధిదారులు భరించి మిగతా మొత్తం బ్యాంకుల ద్వారా రుణాలు అందించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందులో 40శాతం రాయితీ ఉంటుందని తద్వారా మెకనైజ్డ్ బోట్లు కొనుగోలు చేయవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జువ్వలదిన్నె సర్పంచు అంకయ్య, బోగోలు జడ్పీటీసీరాలు సులోచనమ్మ, మత్స్యకారులు పాల్గొన్నారు.

ధాన్యలక్ష్మీ నమోస్తుతే



వేరు శనగ కాయలు, గింజలతో అమ్మవారి రూపు

నెల్లూరు (సాంస్కృతికం): శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా నెల్లూరులోని రాజరాజే శ్వరి ఆలయంలో వేరుశనగ కాయలు, గింజలతో అమ్మవారిని విశేషంగా అలంక రించారు. ఉభయకర్త కొలపర్తి రమేష్ దంపతుల ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. భక్తులకు పసుపు, కుంకుమతో పాటు రవికలను ప్రసాదంగా అందజేశారు. అన్నప్రసాద వితరణ జరిగింది. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొల్హాపురి మహాలక్ష్మి పూజ వైభవంగా జరిగింది. పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా అర్బన్ ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీకళ ఆధ్వర్యంలో వెయ్యి మంది ముత్తైదువులకు పసుపు, కుంకుమ జాకెట్లు పంపిణీ చేశారు. రాత్రి అమ్మవారి మూలమూర్తికి పుష్పాలు, తమలపాకులతో ప్రత్యేక అలంకారం జరిగింది. సుజాత్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో లక్ష్మీదేవికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. వీటితో ఈ ఏడాదికి శ్రావణ శుక్రవార పూజలు, ఉత్సవాలు ముగిశాయి. ఆఖరిరోజు ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటాలి

వన మహోత్సవంలో మంత్రి నారాయణ పిలుపు





ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం): ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర పురపాలక, పట్టాణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరులోని నగరవనంలో శుక్రవారం జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, కలెక్టర్ ఆనంద్ తదితర అధికారులతో కలిసి మొక్కలు నాటా రు. అక్కడే ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని తిలకించారు. అనంతరం జరిగిన సభలో వన మహోత్సవ పోస్టర్‌ను విడుదల చేసి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు జిల్లాలో పచ్చదనం పెంపునకు అందరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోనే నెల్లూరు నగరవనం నెం.1గా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యా వరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే లు, కలెక్టర్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు మాట్లాడా రు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి చంద్ర శేఖర్, శ్రీనివాసులరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, పలు శాఖల అధికారులు, రేంజర్లు, అటవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి నారాయణ

పిల్లలతో సరదాగా..

వన మహోత్సవంలో మంత్రి నారాయణ పిల్లలతో సరదగా గడిపారు. విద్యార్థులతో కలిసి ఆటలాడి సెల్ఫీలు దిగుతూ వారి టోపీలపై ఆటోగ్రాఫ్‌లు పెట్టారు. అనంతరం ఎమ్మెల్యేలతో కలసి జిమ్ చేశారు.

ప్రభుత్వ భూమేగా చేసేయ్ కబ్జా!

- టిడ్కో గృహాల భూమికే ఎసరు
- అంకణం రూ.1లక్ష చొప్పున విక్రయం
- నెల్లూరులో బరితెగిస్తున్న అక్రమార్కులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : టిడ్కో నివాసాల కోసం సేకరించిన రూ.కోట్లు విలువైన భూమిపై కొందరి అక్రమార్కుల కన్నుపడింది. దర్జాగా కబ్జా చేసి అంకణం రూ.లక్ష చొప్పున అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసిన వ్యక్తులు సదరు భూమిలో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. నెల్లూరులోని భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో సర్వే నెం.2222లో దాదాపు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. పేదలకు టిడ్కో నివాసాల కోసం రైతులకు ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించి అప్పటి టీడీపీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. తరువాత అధికారం లోకి వచ్చిన వైసీపీ ఇందులోని రెండు ఎకరాలను వైసీపీ కార్యాలయానికి కేటాయించి పనులు చేపట్టారు. మిగిలిన రెండు ఎకరాలపై అక్రమార్కుల కన్నుపడింది. గతంలోనూ ఈ భూమిని కుల సంఘాలకు కేటాయించారని బోర్డులు ఏర్పాటు చేసుకొన్నారు. ఈ విషయాన్ని అప్పట్లో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో రెవెన్యు అధికారులు స్పందించి, బోర్డులు ఏర్పాటు చేశారు. తాజాగా అదేప్రాంతంలో భూఆక్రమణలు జరుగుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు భూమిని ఆక్రమించి అంకణాలు చొప్పున విక్రయిస్తున్నారు. ఇంత జరుగు తున్నా అధికారులు కునుకు వహించడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలువైన ప్రభుత్వ భూమి పరులపాలు కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఆక్రమిత స్థలంలో దుకాణాలు నిర్మిస్తున్న దృశ్యం

ఆక్రమిస్తే కఠిన చర్యలు

టిడ్కో నివాసాల కోసం సేకరించిన భూములను ఎవరికీ కేటాయించలేదు. కేవలం గత ప్రభుత్వం వైసీపీ కార్యాలయానికి మాత్రమే రెండు ఎకరాలు కేటాయిం చాము. తరువాత ఎవరికీ ఇవ్వలేదు. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకొంటాము. వెంటనే ఆక్రమణలు తొలగిస్తాము.

- మలోల, నెల్లూరు ఆర్డీవో

బెగ్గింగ్ మాఫియాపై కేసు

● బాలలతో భికాటన ● కలెక్టర్ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్


శిశుగృహకు తరలించిన బాలలతో అధికారులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30: నెల్లూరు నగరంలోని బెగ్గింగ్ మాఫియాపై కలెక్టర్ ఆనంద్ సీరియస్ అయ్యారు. చిన్నారులను ఎత్తుకుని భిక్షాటన చేస్తున్న మహిళలపై చిన్నబజారు పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డీసీపీవో సురేష్, ఏహెచ్‌టీయూ ఏఎస్‌ఐ సతీష్, సిబ్బంది శ్రీహరి, ప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ టీ మాధవి, సభ్యులు కలిసి శుక్రవారం నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆర్టీసీ, వీఆర్సీ, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండు కూడళ్లలో చిన్నారులతో భిక్షాటన చేస్తున్న మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండేళ్ల వయసున్న ముగ్గురు బాలురు, నాలుగేళ్ల వయసున్న బాలికను సంర క్షించి శిశుగృహలో, సర్వీస్‌హోంలో చేర్పించారు. భిక్షాటన చేస్తున్న మహిళలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీపీవో సురేష్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జువనైల్ జస్టిస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. సదరు మహిళలను విచారిస్తున్నారు. ఈ డ్రైవ్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి మాట్లాడుతూ ఎక్కడైనా చిన్నారుతో భిక్షాటన చేయిస్తుంటే హెల్ప్‌లైన్ నెంబరు 15100, 0861-2330579 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించాలి : సీఐటీయూ


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 30 : అదానీ కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టును అదానీ చేజిక్కించుకున్న తర్వాత ఇతర పోర్టులలో వ్యాపార లావాదేవీల కోసం జిల్లా ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఐరన్ ఓర్, కోల్ లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకునే విధంగా క్రేన్ బిగించటం వల్ల టెర్మినల్ కార్యకలాపాలు ఉండవన్నారు. జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసెంబ్లీలో దీనిపై చర్చించి కంటైనర్ టెర్మినల్ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారన్నారు. కానీ అదానీ యాజమాన్యం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే 8 బెర్తులను, కంటైనర్ టెర్మినల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గడ్డం అంకయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

మర్రిపాడు, ఆగస్టు 30: అటవీ సమీప గ్రామం పడమటినాయుడుపల్లిలోకి శుక్రవారం మధ్యాహ్నం చుక్కల దుప్పి వచ్చింది. దీన్ని గమనించిన గ్రామ కుక్కలు దానిపై దాడి చేయడంతో అది మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు గ్రామానికి వచ్చి దానికి పంచనామా నిర్వహించి అడవిలో కననం చేశారు. మంచినీరు దొరక్క ఇటీవల అడవి జంతువులు గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో గ్రామ ప్రజలు ఒకపక్క భయభ్రాంతులకు గురౌతున్నారు. మరోపక్క జంతువులు కుక్కల దాడిలో, రోడ్డు దాటే క్రమంలో తరచూ ప్రమాదాలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి.

డిష్ వైరులో విద్యుత్ సరఫరా

● విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

అనంతసాగరం, ఆగస్టు 30: సంజీవనగరం కు చెందిన డి.మనో అనే బాలుడు శుక్రవారం విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. ఇంటి పరిసరా ల్లోని డిష్‌వైర్‌ను పట్టుకోవడంతో అందులో విద్యుత్ సరఫరా అవుతుండగా ప్రమాదంకు గురయ్యాడు. చేతికి గాయం కావడం కుటుంబ సభ్యులు బాలుడిని అనంతసాగరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం చేయించారు.


గాయపడిన బాలుడు

పొట్టకూటి కోసం వెళ్లి.. మృత్యుఒడికి...

● రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి ● మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన రెక్కల నాగేంద్ర (ఫైల్)

ఉదయగిరి రూరల్/ చేజర్ల, ఆగస్టు 30: స్వగ్రామాల్లో ఎలాంటి ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకొని జీవనోపాధి కోసం రాష్ట్రం కాని రాష్ట్రానికి వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి బెంగుళూరు సమీపంలోని హొస్‌కోట వద్ద చోటుచేసుకొంది. వివరాల మేరకు.. వరికుంటపాడు మండలం జీ.కొత్తపల్లి గ్రామానికి చెందిన రెక్కల నాగేంద్ర(28) గత కొన్నేళ్లగా బెంగుళూరు నగరంలోని కేఆర్‌పురంలో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బెంగుళూరులో పని చేసుకుంటున్న ఉదయగిరి మండలం సున్నంవారిచింతల గ్రామానికి చెందిన దేవండ్ల వెంకటేష్‌తో కలిసి హొస్‌కోటలో ఎలక్ట్రీషియన్ పనికెళ్లి తిరిగి మోటార్‌బైక్‌పై బెంగుళూరుకు వెళుతున్నారు. ఈ క్రమంలో హొస్‌కోట సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు వారిని క్రాస్ చేయబోయి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరు పక్కనే ఉన్న చెట్లపొదల్లో పడిపోయారు. శుక్రవారం తెల్లవారుజామున అటుగా వస్తున్న వాహనదారులు ప్రమాదాన్ని గుర్తించి చెట్లపొదల్లో పడి ఉన్న క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో నాగేంద్ర మృతిచెందాడు. వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కాగా మృతిచెందిన నాగేంద్రకు ఏడాది క్రితం వివాహమై ఒక పాప ఉంది. అతని మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

పడవల ర్యాంప్ ఏర్పాటుకు చర్యలు


పెన్నానదిలో పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

సంగం, ఆగస్టు 30: స్థానిక పెన్నా బ్యారేజీకి ఎగువన డ్రెడ్జింగ్ విధానంలో డీసిల్టింగ్ ఇసుకను తీసేందుకు ప్రభు త్వం అనుమతి ఇచ్చింది. అయితే డ్రెడ్జింగ్ విధానంలో పడవ నీటిలో దిగేందుకు అనువుగా లేకపోవడంతో మైనింగ్ శాఖ జేడీ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం హెటాచ్ యంత్రంతో ర్యాంప్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా మైనింగ్ జేడీ మాట్లాడారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సంగం పెన్నానదిలో ఇసుకను డ్రెడ్జింగ్ విధానంలో డీసిస్టింగ్ తీసి ఇసుక రీచ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు సోమ్లా నాయక్, రెవెన్యూ సిబ్బంది, ఇరిగేషన్ అధికారి బీవీ కృష్ణ, గౌస్‌భాష ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	102
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6927
వెండి కిలో ధర	రూ. 87,600
వెండి ఒక గ్రాము	రూ. 90.60

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ యూనిఫాం మార్పు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 30: ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ డ్రస్ కోడ్‌ను మారుస్తూ ఆ విభాగ డీజీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా శుక్రవారం ముత్తుకూరు మండలం నేలటూరులోని ఏపీ జెన్‌కో కార్యాయలంలో చీఫ్ ఇంజనీర్ సుధీర్‌బాబు, అసిస్టెంట్ కమాండెంట్ ఎంఎస్ రెడ్డి కొత్త డ్రస్‌కోడ్‌ను ఆవిష్కరించి సిబ్బందికి అందజేశారు. యాక్సిస్ కంట్రోల్ విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు పలు అంశాలపై సుధీర్ బాబు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కేవీ నాయక్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిలలో 35.139 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 30: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 10,695 క్యూసెక్కులు ప్రవాహం వస్తుంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 35.139 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండ లేరుకు 3,500, పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు 500, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

హోరాహోరీగా రైల్వే కార్మికుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

బిట్రగుంట, ఆగస్టు 30: బిట్ర గుంట రైల్వే ఇనిస్టిట్యూట్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు శుక్ర వారం హోరాహోరీగా జరిగాయి. కావలి, బిట్రగుంట, కృష్ణపట్నం, నెల్లూరు నుంచి 20 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. బిట్రగుంట యూనియన్ అధ్యక్షుడు మద్దిబోయిన శేఖర్ యాదవ్, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, కావలి, బిట్రగుంట పీడబ్ల్యూఐలు ఎస్కే.హుస్సేన్, ఏకే.కృష్ణన్, గార్డు రాజేష్, తదితరులు పర్యవేక్షించారు.


షటిల్ బ్యాడ్మింట్‌లో తలపడ్డ బిట్రగుంట, కృష్ణపట్నం జట్లు

వెకిలి చేష్టలు.. మసాజ్‌లు

● ఆర్టీసీ కార్గోలో నిర్లక్షపు సిబ్బంది
● వినియోగదారులకు అవమానాలు
● ఆంధ్రజ్యోతి ప్రత్యేక నిఘా
● ఇద్దరిని విధుల నుంచి తొలగించిన ఆర్‌ఎం



ఆర్టీసీ నెల్లూరు ప్రధాన బస్టాండులోని కార్గో పాయింట్


పనివేళలో మసాజ్ చేసుకుంటున్న సిబ్బంది

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 30 : నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ఉన్న కార్గో విభాగంలో నిర్లక్ష్యం తాండ విస్తోంది. కార్గో ద్వారా రాష్ట్రంలోనే అధిక ఆదాయం ఇస్తున్న ఈ కేంద్రంలో వినియోగదారులు నిత్యం అవమానాలు ఎదుర్కో వాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ సిబ్బంది, హమాలీల ఆగడాలకు అడ్డే లేకుండాపోతోంది. ఈ క్రమంలో పలువురు వినియోగదారులు వారు ఎదుర్కొంటున్న అవమా నాలను ఏబీఎన్ ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో బుధ, గురువారాల్లో ప్రత్యేక నిఘా ఉంచగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది, హమాలీలు చేస్తున్న వెకిలి చేష్టలు, వినియోగదారులతో మాట్లాడుతున్న డబుల్ మీనింగ్ మాటలు, పనివేళల్లో మజాజ్‌లు వంటి అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. వీటిని ఆర్టీసీ ఆర్‌ఎం దృష్టికి తీసుకు వెళ్లగా విచారణ చేపట్టిన ఆయన ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని, ఒక హమాలీని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడు డిపోల్లో 32 కార్గో పాయింట్లు

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో 32 కార్గో పాయింట్లు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్గో పాయింట్లను సింగ్యూ సొల్యూషన్స్ సంస్థకు అప్పగించారు. వారు అవుట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని నియమించుకుని హమాలీల ద్వారా పార్శిళ్ల పంపడం, తీసుకోవడం చేస్తున్నారు. జిల్లాలోని నెల్లూరు ప్రధాన బస్టాండు, కావలి బస్టాండులోని కార్గో పాయింట్ల ద్వారా ఆర్టీసీకి అధిక ఆదాయం వస్తోంది. అయితే కార్గోలో పార్శిల్ బుక్ చేసే వారికి కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. నెల్లూరు ప్రధాన బస్టాండులోని కార్గో పాయింట్‌లో సిబ్బంది ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై విరుచుకుపడుతూ నోటికి పనిచెబుతున్నారు. ఇక్కడి కార్గోలో పార్శిల్ బుక్ చేస్తే రశీదును పార్శిల్‌పై అతికించేందుకు కనీసం టేపు కూడా అందుబాటులో ఉంచడం లేదు. డెలివరీ తీసుకునేందుకు వచ్చిన ప్రజల పరిస్థితి అయితే మరీ అధ్వానంగా ఉంది.


టేప్ లేని ఖాళీ మిషన్

3న మెగా జాబ్‌మేళా

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట): ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 3న జిల్లాలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సీ విజయ్ వినీల్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ, కావలిలోని వైకుంఠపురం, నెల్లూరులోని ఓల్డ్‌చెక్ పోస్టు వద్ద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. అమేజాన్, టీసీఎల్, ఏపీటీవో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, నాయుడుపేటలోని గ్రీన్‌టెక్ ఇండ్రస్ట్రీస్, శ్రీసిటీలోని డైకిన్ కంపెనీ, చిత్తూరులోని అమర్‌రాజా బ్యాటరీస్‌లో ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు జెరాక్స్, బయోడెటా తీసుకోని రావాలని సూచించారు. వివరాలకు 8074634065ను సంప్రదించాలన్నారు.

ప్రజల మనసులో నిలిచిపోయే వ్యక్తి బాలయ్యబాబు

● సినీ రంగంలో 50 వసంతాలు పూర్తి చేసుకున్నారు
● పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ
● కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు


భారీ కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి నారాయణ, కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 30 : తెలుగు ప్రజల మనసులో ఎప్పుడూ నిలిచి ఉండే వ్యక్తి నందమూరి బాలయ్య బాబేనని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. సినీ రంగంలో 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరులోని బాలకృష్ణ సేవాసమితి కన్వీనర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నర్తకి సెంటర్‌లో సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి, కోటంరెడ్డి కట్ చేసి అభిమానులు, నేతలకు పంచిపెట్టారు. మంత్రి నారాయణ మాట్లాడారు. చలనచిత్ర రంగంలో బాలయ్య బాబు 50 ఏళ్ల పూర్తి చేసుకోవడం ఎంతో శుభపరిణామమన్నారు. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో బాలయ్య ఎన్నో పాత్రలను పోషించి ప్రేక్షకులు, అభిమానులను అలరించారన్నారు. అలాంటి బాలకృష్ణ తన తల్లి పేరు మీద కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేసి ఎందరికో వైద్యసేవలు అందిస్తున్నారని కొనియాడారు. సినీరంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ గుర్తుండిపోయే వ్యక్తి బాలయ్యబాబే నన్నారు. కోటంరెడ్డి శ్రీనివా సులరెడ్డి మాట్లాడుతూ 1994 నుంచి 'తాతమ్మ కల' ద్వారా సినీ రంగంలోకి వచ్చిన బాలయ్య నేడు 50 వసంతాలు పూర్తి చేసుకున్నారన్నారు. ప్రపంచంలో ఏ హీరో అయినా 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భాలు లేవని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, నారాయణ అండతో బాలకృష్ణ ముందుకు వెళతారని అభిప్రాయపడ్డారు. ఈ సంబరంలో బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు కృష్ణ, నందబాషా, సత్యనాగేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వర్, బాలాజీ, గాంగాధర్, మెయిద్దీన్, జాకీర్ జాఫర్ మొయిద్దీన్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇళ్లపై విజిలెన్స్ విచారణ


విచారణ చేస్తున్న విజిలెన్స్ టీం లీడర్ వెంకట రెడ్డి

సంగం: మండల కేంద్రంలోని మూడే లే అవుట్లలోని జగనన్న కాలనీ ఇళ్లను శుక్రవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్స్ టీం లీడర్ వెంకటరెడ్డి ప్రతి ఇంటికి ఇప్పటి వరకు ఎంత బిల్లు మంజూరు చేశారు, ఇళ్ల ఎంతవరకు నిర్మించారు, నిర్మాణాల నాణ్యతపై పరిశీలించారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ ముక్తార్ కాలనీ ఇళ్ల నిర్మాణాలను జాబితా వారీగా వివరించారు. విజిలెన్స్ అధికారి తన వద్ద ఉన్న జాబితా ప్రకారం పరిశీలించారు. ఇదేవిధంగా మరో రెండు టీంలు మండలంలోని ఇతర గ్రామాల్లోని జగనన్న కాలనీ ఇళ్ల నాణ్యతను పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. మొత్తం పరిశీలన అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

మనుబోలు: మండలంలోని మనుబోలు, పిడూరు, లక్ష్మీనరసింహపురం, జట్లకొండూరు, కట్టువపల్లి, బద్దెవోలు, బండేపల్లి గ్రామాల్లోని జగనన్న కాలనీలను విజిలెన్సు అధికారులు తనిఖీలు నిర్వహించారు. మనుబోలు హౌసింగ్ కార్యాలయం, వెలుగు కార్యాలయంలో రికార్డులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. డీఈ మహిత మాట్లాడుతూ 21 జగనన్న లేఅవుట్‌లలో కేవలం 45 ఇళ్ళు మాత్రమే పూర్తయ్యాయని, నాలుగు లేఅవుట్‌లలో అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. విజిలెన్సు ఏఈ అవినాష్ రెడ్డి, హౌసింగ్ ఏఈ రవికుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శులకు బదిలీలు


బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్న ఎస్పీ, ఏఎస్పీలు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 30 : జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ శుక్రవారం పారదర్శకంగా సాగింది. దివ్యాంగులు, సరస్పరం, ఒంటరి మహిళలు, వితంతు ఉద్యోగులు, ఇతరులు కింద బదిలీలకు దరఖాస్తు చేసుకున్న 165 మంది కార్యదర్శులకు బదిలీల పక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్‌పై ప్రదర్శింపజేసి ర్యాంక్ ప్రకారం నిబంధనలు అనుసరించి బదిలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల భద్రత, రక్షణే ధ్యేయంగా నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, అధికారులు పాల్గొన్నారు.

కోనలో పాలకవర్గం కొలువుదీరేదెన్నడో!?

● 8 నెలలుగా చైర్మన్ లేక.. ఈవో పట్టించుకోక
● ఉద్యోగులపై కొరవడిన పర్యవేక్షణ.. వారిదే ఇష్టారాజ్యం



రాపూరు, ఆగస్టు 30 : 'ఆలయంలో ఆధ్యాత్మికత వెల్లివిరియాలి. ఆలయ పవిత్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.. శుభ్రతలో రాజీపడ కూడదు. భద్రత కట్టుదిట్టంగా ఉండాలి.' ఇవి తరచూ పెద్దలు చెప్పే మాటలు. కానీ జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అందుకు భిన్నంగా ఉంటోంది. వైసీపీ ప్రభుత్వంలో ముగిసిన పాలకవర్గం 8 నెలలు దాటినా కొలువుదీరలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా అతీగతీలేదు. దీంతో కోనలో అభివృద్ధి పనులు, భక్తులకు సౌకర్యాల కల్పన, భద్రత గాలిలో దీపంలా మారింది. ఒకప్పుడు పాలకవర్గం ముగియగానే ఇన్‌చార్జులను, ఉత్సవ కమిటీలను నియమించి పర్యవేక్షణ చేపట్టేవారు. వైసీపీ ప్రభుత్వం చివరిలో పాలకవర్గం గడువు ముగిసినా ఉత్సవ కమిటీ కాదు కదా ఇన్‌చార్జిని నియమించిన దాఖలాలు లేవు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి 3 నెలలు గడుస్తున్నా ఇప్పటికి అనేక పర్యాయాలు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పెంచలకోనను సందర్శించి మాస్టర్ ప్లాన్ అమలు, అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. కానీ అమలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. నెలల తరబడి చైర్మన్ లేకపోయినా దేవ స్థానంలో ఈవోగా డిప్యూటీ కమిషనర్ హోదాలో ఉన్న అధికారి చుట్టపు చూపుగా క్షేత్రానికి వచ్చి వెళ్లిపోతున్నారు. కోనకు వచ్చే భక్తులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక అసహనం వ్యక్తం చేస్తూనే వెళ్లి పోతున్నారు. ఇంకేముంది.. ఆలయంలో ఉన్న సిబ్బంది తమ ఇష్టానుసారం వ్యవహరి స్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి పాలకవర్గం ఏర్పాటుతో పాటు ఖాళీగా సూపరిం టెండెంట్, జూనియర్ సహాయకులు వంటి పోస్టులను పూర్తిస్థాయిలో నియమించి జవాబు దారీతనం ఉండేలా కోనలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పట్టుకున్నది ప్రజలు.. వదిలేసింది పోలీసులు

● ఇసుక అక్రమ రవాణాలో ఇదీ దుస్థితి
● వరికుంటపాడు మండలం తూర్పుచెన్నంపల్లిలో ఘటన


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

వరికుంటపాడు, ఆగస్టు 30: నిబంధనలకు విరుద్ధంగా గురువారం రాత్రి ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను కొంతమంది గ్రామస్థులు గుర్తించి అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుచెన్నంపల్లి పిల్లాపేరు వాగు నుంచి రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. అటుగా ప్రయాణం చేస్తున్న కొంతమంది వాటిని గమనించి జడదేవి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి మీదుగా పథకం ప్రకారం వెంబడించారు. పోలీసు స్టేషన్ ఎదుట ఆ ట్రాక్టర్లను అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్‌లో ఉన్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా ఏం రాజకీయ జోక్యం చోటు చేసుకుందో తెలియదు కాని యాజమానులు ట్రాక్టర్లను అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. రిస్క్ తీసుకుని అక్రమంగా ఇసుకను తరలించే ట్రాక్టర్లను సామాన్య ప్రజలు పట్టుకుంటే రాజకీయ నాయకుల ఒత్తిడికి అధికారులు తలొగ్గి వదిలేశారని గ్రామంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఆశ కార్యకర్తకు న్యాయం చేయండి

● ఎమ్మెల్యేని చుట్టుముట్టిన కార్యకర్తలు


విజయమ్మకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే కాకర్లను చుట్టుముట్టిన ఆశ కార్యకర్తలు

కలిగిరి, ఆగస్టు 30: మండలంలోని రావులకొల్లు గ్రామ ఆశ కార్యకర్త పందిటి విజయమ్మకు న్యాయం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకుడు పెంచల నరసయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పలువురు ఆశ కార్యకర్తలతో కలసి పీహెచ్‌సీ సమీపంలో ప్రధాన రహదారిపై బైటాయించారు. ఆ మార్గంలో వెళ్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వాహనాన్ని చుట్టుముట్టారు. గ్రామ సర్పంచు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంతో గత 16 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తేవడం స్థానిక నాయకులకు సమంజసం కాదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ చిరుద్యోగులకు తెలుగుదేశం ప్రభుత్వంలో ఎటువంటి అన్యాయం జరగదని, విజయమ్మకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

'సూర్య ఘర్'పై విస్తృత ప్రచారం చేయండి

● ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 30: పీఎం సూర్య ఘర్ సోలార్ విద్యుత్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. ఆయన కార్యాలయం నుంచి జిల్లాలోని విద్యుత్ అధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ప్రతి ఒక్కరికీ ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. దీనిపై కరపత్రాల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే, విద్యుత్ ప్రమాదాలు.. వాటి నుంచి రక్షణ పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఘనంగా వన మహోత్సవం
- మొక్కలు నాటిన అధికారులు, నాయకులు

సంగం, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని సోషల్ ఫా రెస్ట్ రేంజ్ అధికారి మల్లికార్జునరావు పిలుపు నిచ్చారు. వనమహోత్సవం సందర్భంగా షెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డీఆర్‌వో సౌజన్య, బీట్ ఆఫీసర్ దొరసానమ్మ, సంస్థ సభ్యుడు వాగాల శ్రీహరి, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



సంగం: గాంధీజన సంఘం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న అధికారులు

ఆత్మకూరు: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు మేరకు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించి చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాల్, సీఐ గంగాధర్‌రావు, ఎస్ఐ షేక్ జిలానీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో ఉదయం సిబ్బంది క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటారు.


సీతారామపురం: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో..

ఎమ్‌సీ చైర్మన్ సురేంద్రరెడ్డి, టీడీపీ, చీదర్ల మల్లికార్జున, బీజేపీ మేకపాటి మాల్యాద్రినాయుడు, కాకర్ల మధు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకట రెడ్డి తెలిపారు. గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోసి కంచెలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఓబులరెడ్డి, శ్రీరా ములు, మట్ల రామయ్య, లక్ష్మయ్య, మన్నేటి గంగిరెడ్డి, సురేంద్ర, రవీంద్ర పాల్గొన్నారు.

సీతారామపురం: జిల్లా అటవీశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్ ఆదేశాలతో సీతారామపురం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.వి.ప్ర సాద్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులు పాఠశాలల ఆవరణలో విద్యా ర్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్ర మంలో హెచ్‌ఎం షాజిదా, ఉపాధ్యాయులు వెంగయ్య, అంజాద్‌బాష, జయరామిరెడ్డి, ఫారెస్ట్ సిబ్బంది ఖాజ, గౌతమ్ పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నివారించాలంటే విరివిగా మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డీఆర్వో శ్రీనివాసులు తెలిపారు. ఆదర్శ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైమన్‌రావు,

కలువాయి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాపూరు సీఐ విజయకృష్ణ మొక్క లు నాటారు. అ నంతరం ఇక్కడ పనిచేస్తూ నెల్లూరుకు బదిలీ అయిన ఎస్ఐ అయ్యప్పను సీఐ, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.


ఉదయగిరి రూరల్: మొక్క నాటుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి


ఆత్మకూరు: పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న పోలీసులు


కలువాయి: మొక్క నాటుతున్న రాపూరు సీఐ విజయకృష్ణ

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఐ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ వీరప్రతాప్

వింజమూరు, ఆగస్టు 30: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ వీరప్రతాప్ శుక్రవారం గెస్ట్‌హౌస్‌లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సు రేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే ఎస్ఐ వీరప్రతాప్‌ను టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. పార్టీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మండల కన్వీనర్ నరసారెడ్డి, చల్లా శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 27: దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం సభ్యులు శుక్ర వారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వ హించారు. ఈ పోటీల్లో మండంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 30: ప్రతిఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు నాగరాజు తెలిపారు. పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా శుక్రవారం బ్రహ్మేశ్వరంలో గ్రామస్థు లకు వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పోలయ్య, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

అనంతసాగరం: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సమావేశం నామమాత్రంగా జరిగింది. మొక్కుబడిగా జరిగిన కార్యక్రమంలో అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ స్కీంను రద్దు చేయాలి

ఆత్మకూరు, ఆగస్టు 30: ఏకీకృత పెన్షన్ స్కీం ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించా లని శుక్రవారం యూటీఎఫ్ నేతలు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిర సన వ్యక్తం చేశారు. అనంతరం డీటీకి తహసీల్దారు రాజేష్‌కు వినతిపత్రం ఇచ్చారు.


ఆత్మకూరు: వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఉదయగిరి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీటీ జహీర్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎడమ తిరుపతయ్య, మీనిగ ఫణి, అనీఫ్ భోగ్యం శ్రీనివాసులు, జీ.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కుంభాభిషేక పూజలు ప్రారంభం


పూజలు చేస్తున్న వేదపండితులు

సంగం, ఆగస్టు 30: వంగల్లు కామాక్షిదేవి భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్ర వారం సంప్రోక్షణ పునఃప్రతిష్ఠ, కుంభాభిషేక పూజలు బద్వేల్ బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్య నారాయణస్వామి ఆధ్వ ర్యంలోప్రారంభమయ్యాయి.

ఆత్మకూరు: శ్రావణమాసం చివరి శుక్రవారం ఆత్మకూరులోని ఆలయాలు భక్తు లతో కిటకిటలాడాయి. వేకువజామునుంచే మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, శ్రీకన్యకాపరమేశ్వర ఆలయం, అలఘునాథ స్వామి ఆలయం, బీఎస్ఆర్ సెంటర్‌లోని మహాలక్ష్మిదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని మల్లెపూలతో అభిషేకించారు.

వింజమూరు: స్థానిక నైరుతిదిక్కున కొండపై వెలసిన వింజెటమ్మ ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి అనంతరం పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నిర్వాహకులు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

మర్రిపాడు, ఆగస్టు 30: వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆత్మకూరు సీఐ గంగాధర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మర్రిపాడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వినాయక విగ్రహాల ఏర్పాటు చేసేందుకు 5మంది చొప్పున కమిటీగా ఏర్పడి పోలీస్ స్టేషన్‌లో అనుమతి పొందాలన్నారు. విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేస్తారు?, ఎప్పుడు ఎక్కడ నిమర్జనం నిమజ్జనం చేస్తారో తెలపాలన్నారు.


ప్రభుత్వ భూమిలో నిమ్మ మొక్కల తొలగింపు

కలువాయి, ఆగస్టు 30: మాదన్నగారిపల్లెలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నాటిన నిమ్మ మొక్కలను శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య తహసీల్దారు లీలా సంజీవకుమారి, వీఆర్వో జనార్దన్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. వారంరోజుల కిందట ప్రభుత్వ భూ మిని కొందరు ఆక్రమించి రాత్రికి రాత్రే నిమ్మ మొక్కలు వేశారని గ్రామస్థులు కొందరు ఆత్మ కూరు ఆర్డీవో ఫిర్యాదు చేశారు. వీఆర్వో జనార్దన్ ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేసి మొక్కలను మీరే తొలగించాలని ఆక్రమణదారులకు కొంతగడువు ఇచ్చారు. వారు మొక్కలను తొలగించకపోవడంతో అధికారులే చర్యలు తీసుకున్నారు.

లక్ష్యాలను అధిగమించాలి : ఏపీడీ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 30: ఉపాధిహామీ పథకానికి సంబంధించిన లక్ష్యాలను అధికారులు, సిబ్బంది వందశాతం అధిగమించాలని క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ సమీపంలోని పండ్లతోటలను పరిశీలించారు. ఉపాధి హామీ పను లకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామసభల్లో గుర్తించిన పనులకు సం బంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. త్వరలో జరగనున్న సామాజిక తనిఖీకి సంబంధించి రికార్డులను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు కమిషనర్‌గా గంగాప్రసాద్



ఆత్మకూరు, ఆగస్టు 30: స్థానిక మునిసిపాలిటీ నూతన కమిషనర్‌గా గంగాప్రసాద్ నియమితులయ్యారు. ఆయన సూళ్లూరుపేటలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాను మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ అందాయి.

ఆంగ్లభాషా సామర్థ్యాలను పెంచాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 30: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆంగ్ల సామర్థ్యాల పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం ఆయన దుంపవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సంద ర్శించి విద్యార్థుల యొక్క అభ్యసన, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం వనమ హోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు ఉదయ్‌కుమార్, రామకృష్ణ, మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 30: దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని కట్టకిందపల్లి ఎస్సీ కాలనీలోని సర్వేనెంబర్ 1026-3లో 0.05 సెంట్ల భూమిలో శుక్రవారం తహసీ ల్దారు నాగరాజు ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అనుమ తులు లేకుండా భూమిని ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా వారిపై చర్యలు తప్పవన్నారు.

సిద్దేశ్వరాలయంలో చోరీ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 30: గండిపాలెం జలాశయ ఆవరణలోని సిద్దేశ్వరాలయ ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం గ్రామస్థులు ఈ విషయంపై మాట్లాడారు. ఆలయ ప్రధాన గేటు తాళాలను తొలగించి లోపలికి ప్రవేశిం చారన్నారు. అనంతరం అక్కడే ఉన్న హుండీ తాళాన్ని తీసి అందులోని నగదు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

లింగసముద్రం : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 5,331 మంది లబ్ధిదారులున్నారని, వీరికి రూ.2,20,82,500 పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

‘వనం’లో భాగస్వాములవుదాం

- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

కావలిటౌన్, ఆగస్టు 30: వనమహోత్సంలో మనం భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పీజీ కళాశాల ప్రాంగణంలో అటవీ శాఖ, రోటరీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీఎస్‌యూ వీసీ ఎస్ విజయభాస్కర్, ఆర్డీవో శీనానాయక్, అటవీ శాఖ అధికారి రాజశేఖర్‌బాబుతో లకసి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవాళి జీవనంతో ఆక్సిజన్ ముడిపడి ఉందన్నారు. వీసీ విజయభాస్కర్ మాట్లాడుతూ పచ్చదనం కరువైతే వాతావరణంలో కార్బన్ డయాక్సడ్ పెరిగిపోయి గ్లోబల్ వార్మింగ్ వంటి విపత్తులు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి సలీమ్, సీనియర్ రొటేరియన్లు జయచంద్ర నాయుడు, డాక్టర్ మాధవరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


కావలిటౌన్ : మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్

లింగసముద్రం : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెదపవని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్నేహలత, టీడీపీ నాయకులు షేక్ రఫీ, షేక్ కరీముల్లా, పఠాన్ హిదయతుల్లా, ధనుం మధు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవపాడు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి నాటించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి కరిముల్లా, హెచ్‌ఎం శివనాగేశ్వరరావు, ఎస్‌బీవోలు మునెమ్మ, సుభాని, కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలోని ఉప్పలూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కామేశ్వర రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శేషయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుండా వేధింపులు తగదు

- ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల నిరసన

కందుకూరు, ఆగస్టు 30: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఏపీ పీటీడీగా మార్చాక జీతాలు, అలవెన్స్‌లు, ఇతర బిల్లుల చెల్లింపులన్నీ ట్రెజరీ ద్వారా జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ట్రెజరీ అధికారులు తమను వేధిస్తున్నారని ఆర్టీసీ కార్మికులు శుక్రవారం కందుకూరులో నిరసన తెలిపారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి గ్యారేజి గేటు వద్ద నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ట్రెజరీలో ఎలాంటి చెల్లింపులు జరగాలన్నా మామూళ్లు ఇవ్వనిదే పనికావడం లేదని, దీంతో జీతాలు తీసుకోవడం మొదలు ఇతర అలవెన్స్‌లు, బిల్లులు పొందాలన్నా నానా అగచాట్లు పడుతున్నారని విమర్శించారు. ప్రతి బిల్లుకు ఏదో ఒక వంక పెట్టి కొర్రీలు పెడుతున్నారని, కార్మికులకు రావాల్సిన నైట్ అవుట్ అలవెన్స్‌లను కూడా ఆపారని విమర్శించారు. తమ నిరసన ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని, ట్రెజరీ అధికారుల తీరును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతోనే ఈ ఆందోళన నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఎన్‌ఎంయూఏ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోళ్ల మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కోటయ్య, కేవీ రెడ్డి, బ్రహ్మారెడ్డి, గంగాధర్, కృష్ణారెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ఏఎస్ రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

- ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

కావలిటౌన్ : సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు శుక్రవారం డిపో వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయు అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కండక్టర్లు, డ్రైవర్లకు నైట్‌ఔట్ అలెవెన్సులు పునరుద్ధరించాలని, జీవో నెంబర్ 114 ఆధారంగా అలెవెన్సులు అమలు చేయాలన్నారు. పీటీడీ రిటైర్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఆర్జిత లీవులు, బకాయిలు చెల్లించాలని, సర్వీసులో ఉన్న ఉద్యోగులకు బకాయి వేతనాలు, అరియర్స్ చెల్లించాలని కోరారు. సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.25,000 ట్రెజరీ ద్వారా చెల్లించాలని, పెండింగ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, జీఎల్ఐ, జీఐఎస్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయు గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీ రావు, ఎంఏ సలామ్, శివశంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై పురపాలక ఉపాధ్యాయుల నిరసన

కావలిటౌన్, ఆగస్టు 30: కావలి పురపాలక సంఘం పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను నిరసిస్తూ ఉపాధ్యాయులు శుక్రవారం వెంగళరావునగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హయ్యుల్ హయ్యూమ్ ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడుతూ ఇప్పటికే పదోన్నతుల బదిలీలు జరగక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్‌గ్రెడేషన్ పోస్టులు మంజూరు కాక జీపీఎస్ సౌకర్యం లేక సతమతమవుతున్నామని, ఆ సమస్యలు పరిష్కరించకుండా బదిలీలు చేపట్టడం తగదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతకుమారి, శర్వాణి, శ్రీనివాసులు, కొండారెడ్డి, శ్రీలక్ష్మి, సుమన, విజయలక్ష్మి, ఏసురత్నం, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

తుమ్మలపెంట రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు

కావలి రూరల్, ఆగస్టు 30: కావలి పట్టణం నుంచి తుమ్మలపెంట వరకు రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. శంకుస్థాపన చేసిన వెంటనే రోడ్డు పనులు చేపట్టనుండడంతో ముందుగా భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద నుంచి బైపాస్ రోడ్డు వరకు రోడ్డు మార్జిన్‌లో మూడు ఎక్స్‌కవేటర్‌లతో చెత్తను తొలగిస్తూ రోడ్డు గుంతలు పూడ్చుతూ రోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. దీంతో గత 5 ఏళ్లుగా ఈ రోడ్డుపై నరకయాతన అనుభవించిన తీరప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలోని తుమ్మలపెంట తీరప్రాంతంలోని పర్యాటక కేంద్రంతో పాటు ఆముదాలదిన్నె, తాళ్లపాలెం, మన్నంగిదిన్నె, తుమ్మలపెంట, అన్నగారిపాలెం పంచా యతీల పరిధిలోని 42 గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది.


తుమ్మలపెంట రోడ్డులో చేపట్టిన పనులు

ధ్వజస్తంభం, దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ

బిట్రగుంట, ఆగస్టు 30: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెంలో వెలసి ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. వేదగిరి ఆంజనేయవరప్రసాద్ ఆచార్యులు, నరేష్ ఆచార్యుల పండిత బృందం శాస్త్రోక్తంగా ధ్వజ, విగ్రహ శుద్ధి, రత్నన్యాసం, యంత్రస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. రామలింగేశ్వరుడి ఆలయ ప్రాంగణంలో జ్ఞానప్రసూనాంబ, కుమారస్వామి, నవగ్రహాలతో పాటు జంటనాగుల శిలల ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. జ్ఞానప్రసూనాంబ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం, అన్నసంతర్పణ కార్యక్రమం చేశారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర పర్యవేక్షించారు.


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

అంకమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం

కందుకూరు, ఆగస్టు 30: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని ఆలయ పూజారులు కనుల విందుగా అలంకారం చేసి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

బాలయ్య అభిమానుల సంబరాలు

బిట్రగుంట, ఆగస్టు 30: బోగోలు మండల నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘ అధ్యక్షుడు ఆవుల సురేష్ ఆధ్వర్యంలో బాలయ్య 50 ఏళ్ల సినీరంగ ప్రవేశ విజయోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కావలి టౌన్ మాజీ అధ్యక్షుడు బీమవరపు మధు, ఇందుపూరి తిరుపతిరెడ్డిలతో కేక్‌కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులు అశోక్ నాయుడు, పేట శ్రీధర్, బొంతా సుధీర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

గుడ్లూరు, ఆగస్టు 30 : ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బసిరెడ్డిపాలెం దగ్గర ఉప్పుటేరు రేవు నుంచి గుడ్లూరుకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం అర్ధరాత్రి పోలీసులు గుడ్లూరు శివాలయం వద్ద ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అలాగే గుండ్లపాలెం మన్నేరు రేవు నుంచి గుడ్లూరుకు వస్తున్న మరో ఇసుక ట్రాక్టర్‌ను కూడా గుండ్లపాలెం అడ్డరోడ్డు వద్ద పట్టుకున్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు.

లింగసముద్రం : మండలంలోని అన్నెబోయినపల్లి సమీపంలోని మన్నేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు ఎస్సై షేక్ మహమ్మద్ సుభాని, సిబ్బంది శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో మన్నేరులో దాడులు చేసి ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సైకి టీడీపీ నేతల అభినందన


ఎస్సైకి అభినందనలు తెలుపుతున్న నేతలు


లింగసముద్రం, ఆగస్టు 30 : కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై షేక్ మహమ్మద్ సుభానిని పలువురు టీడీపీ నేతలు శుక్రవారం కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు అంగులూరి చినకొండయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తాళ్లూరి ముసలయ్య, జంపాల శివప్రసాద్, కొట్టే శేషాద్రి, ఆర్‌ఎంపీ షేక్ పరేష్, బి వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎస్సైను కలిసిన...

కందుకూరు, ఆగస్టు 30: కందుకూరు రూరల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మహేంద్రనాయక్‌ను శుక్రవారం పలువురు టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, బద్దిపూడి శిఖామణి, ఉచ్చులూరి సుబ్బారావు, నిరంజన్ తదితరులు ఎస్సైను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయండి

కందుకూరు, ఆగస్టు 30: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేసేందుకు గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయిలో దశల వారీగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య

స్థానిక కోటారెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన సీపీఐ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు ప్రతి కార్యకర్త సన్నద్ధమయ్యేలా పార్టీ, అనుబంధ సంఘాల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబరు 1 నుంచి 6వ తేదీ వరకు స్థానిక, రాష్ట్ర స్థాయి సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సీపీఐ నాయకులు పి.మాలకొండయ్య, బి.సురేష్‌బాబు, రమణయ్య, వై.ఆనంద్ మోహన్, ఎస్కే. హుస్సేన్, కొండయ్య, దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మక్క స్ఫూర్తితో ఇంటికో మొక్క నాటాలి

● వన మహోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఆగస్టు 30: పర్యావరణ ఉద్యమకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత సాలుమరద తిమ్మక్క స్ఫూర్తితో నియోజకవర్గ ప్రజానీకం ఇంటికో మొక్క నాటాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖాధికారి శివరామ కృష్ణ, తహసీల్దారు నిత్యానందబాబు, ఎంపీడీవో శ్రీహరి, ఎంపీపీ తుమ్మల పెంట పార్వతి, కోవూరు, లేగుంటపాడు, వేగూరు సర్పంచులు విజయమ్మ, జెట్టి రాజగోపాలరెడ్డి, అమరావతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య, పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రశాంతిరెడ్డి బాలికల వసతిగృహాల్ని పరిశీలించి ప్రహరీగోడ, మరుగుదొడ్లు వెంటనే నిర్మిం చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆమె వెంట జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఈవో నాగరాజు, ఎంపీటీసీ కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, బీజేపీ నాయకుడు ఇండ్ల రాఘవేంద్ర, జనసేన నాయకుడు చప్పిడి శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.

●**వెంకటాచలం:** మండలంలోని కనుపూరు ఉన్నత పాఠశాల ఆవరణలో సామాజిక వన విభాగం సెక్షన్ ఆఫీసర్ డి సుకన్య ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పలువురు అధికారులు, నాయకులు విచ్చేసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాదరావు, నాయకులు ఉప్పలపాటి ధనుంజయనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ మస్తాన్‌బీ, తదితరులున్నారు.

●**తోటపల్లిగూడూరు:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు.



కోవూరు : మొక్కలు నాటుతున్న ప్రశాంతిరెడ్డి

ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, వరిగొండ పంచాయతీ టీడీపీ నేత, మాజీ సొసైటీ అధ్యక్షుడు చిన్నబాబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిలోని పలు వార్డులు, లేఔట్లలో హరితాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా నగర పంచాయతీ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వనం-మనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

●**రాపూరు:** కండలేరు అంబేడ్కర్ బాలికల గురుకులంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలన్నారు. డీసీవో కె జయలక్ష్మి, ప్రిన్సిపాల్ కె భారతి, ఏపీవో సుబ్బరాయుడు, ఈసీ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మీదేవికి పూజలు



మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 30: మండలంలోని కోడూరు మహాలక్ష్మీపురంలో శుక్రవారం మహాలక్ష్మీ దేవికి శ్రావణమాస పూజలు నిర్వహించారు. భక్తుల సహాయ సహకారాలతో నాలుగు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వరప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడ ఆలయంలో కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం మల్లికార్జునస్వామి నిత్య కల్యాణోత్సవం జరిగింది. రాత్రి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకి సేవలు నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

మనుబోలు : స్థానిక గంగమ్మ దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు



బుచ్చి పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీకృష్ణభగవానుడు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 30: త్రైత సిద్ధాంత ప్రబోధ ఆధ్వర్యంలో శ్రీకృష్ణభగవానుడి ఊరేగింపు శుక్రవారం నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని బుచ్చిలోని గిరిజాహాల్ సెంటర్‌లో కృష్ణుడి ప్రతిమను నెలకొల్పి పూజలు నిర్వహించిన కమిటీ నిర్వాహకులు శుక్రవారం శ్రీకృష్ణుడి ప్రతిమను పురవీధుల్లో ఊరేగించారు.

కూటమితోనే పేదల అభివృద్ధి

కొడవలూరు, ఆగస్టు 30 : కూటమి ప్రభుత్వంతోనే పేదల అభివృద్ధి సాధ్యమని జనసేన సీనియర్ నాయకుడు కర్తం హజరత్‌రెడ్డి అన్నారు. పెయ్యలపాళెం గ్రామంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. అవినీతి రహిత నియోజకవర్గ స్థాపనకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కృషి చేస్తున్నారన్నారు.

రోగులకు అందుబాటులో ఉండండి : ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 30: వైద్యులు, నర్సులు నిరంతరం అందుబాటులో ఉంటూ రోగులకు వైద్యసేవలు అందించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. వైద్యసేవలు అందించే క్రమంలో ఏవైనా అవసరమైనప్పుడు తనను కలిస్తే సహాయ సహకారం అందిస్తానని చెప్పారు. శుక్రవారం చెల్లాయపాళెంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్లినిక్‌లో 14 రకాల పరీక్షలు నిర్వహించేలా ల్యాబ్, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో సెప్టెంబరు 4వ తేదీ నుంచి సంచార వాహనం ద్వారా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు జరపనున్నట్లు తెలిపారు. 35 ఏళ్ళు పైబడిన మహిళలు, మగవాళ్లకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈసందర్భంగా పలువురు పింఛన్ల సమస్యలపై విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పెంచలయ్య, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నరసింహారావు, వైద్యాధికారులు అహ్మద్‌బాబు, వినయ్‌కుమార్, సర్పంచు రజనీకాంత్, టీడీపీ నాయకులు ఏటూరి శివరామకృష్ణారెడ్డి, శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆసుపత్రిని పరిశీలించి, కాంట్రాక్టర్ శేషయ్యను సత్కరించారు. అలాగే పెద్దూరులోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సందర్శించి, ప్రహరీ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని సీఈఓ కన్నమనాయును ఆదేశించారు. నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పూజలు

కొడవలూరు : నార్సురాజుపాళెంలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కరకటి మల్లికార్జున, పోలంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన



కోవూరులో ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోవూరు, ఆగస్టు 30: పాత పింఛను విధానం అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో యూటీఎఫ్ నాయకులు ఖాజావలి, జమీర్ అహమ్మద్, తిరుపాలు, మాలకొండయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ వెంకటేశ్వర్లు, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రాపూరులో ఆర్టీసీ కార్మికుల ఆందోళన

రాపూరు : ఆర్టీసీ రాపూరు డిపోలో ఎన్ఎంయూ కార్యదర్శి ఏవీ రమణయ్య ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం వివిధ రకాల సమస్యలను గురించి చర్చించారు. కార్యక్రమంలో గ్యారేజీ సెక్రటరీ కె.సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం : సుమారు మూడున్నరేళ్ళుగా బేసుమట్టాలకే పరిమితమైన నగర పంచాయతీ భవన నిర్మాణ పనులను నగర పంచాయతీ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. త్వరితగతిన భవన నిర్మాణం పూర్తిచేయనున్నట్టు తెలిపారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఉడతా

మనుబోలు : టీడీపీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా ఉడతా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి తెలిపారు. పార్టీ కార్యకలాపాలలో చురుకుగా వ్యవహరిస్తుండడంతో విజయ్‌కుమార్ నియమించనున్నామని గాలి తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

వెంకటాచలం, ఆగస్టు 30: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు కండ్రిగ ఉమా పిలుపునిచ్చారు. స్థానిక ఆపార్టీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులుయాదవ్, జిల్లా కార్యదర్శి అలూరు ప్రసాద్‌నాయుడు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సభ్యత్వ నమోదులో మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో హసనాపురం శ్రీనివాసులు, గోత్తల నరేష్, బిరుదువోలు కరీముల్లా, దయాకర్, రాము, శ్రీహరి, శ్రీనివాసులు తదితరులున్నారు.

ఇసుక పథకం అమలుచేయకుంటే ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తాం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 30: ఇసుక పథకం వెంటనే అమలుచేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నేత బంకా తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బుచ్చిలో కార్మికులతో నిరసన ర్యాలీ చేపట్టారు. వెంటనే ఇసుక పథకం అమలు చేయకుంటే ఎమ్మెల్యేల నివాసాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

విడవలూరు, ఆగస్టు 30: దేవాలయ అభివృద్ధికి ఇచ్చిన నగదుని ఏమి చేశారని ప్రశ్నించినందుకు కొందరు వ్యక్తులు దాడిచేయడంతో అవమానం తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదివర్తి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నన్నం దినేష్ శుక్రవారం నెల్లూరులోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దినేష్ మృతి పట్ల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేయించుకోవాలి

ఇందుకూరుపేట, ఆగస్టు 30: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఖాదరవలి సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, టీబీ సంబంధిత పరీక్షల ల్యాబ్ రికార్డులు పరిశీలించారు. అనంతరం డైట్ కాలేజీలో 104 ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ పి కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర్ నాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ విజయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడూరు బీచ్‌లో వ్యర్థాల తొలగింపు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 30: ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ బాధ్యులు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, జనసేన వీర మహిళ గుమ్మినేని వాణి భవానీనాయుడు ఆధ్వర్యంలో మండలంలోని కొత్త కోడూరు తీరం వద్ద పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి చెత్త కుండి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌నాయుడు, పల్లం రాజేష్, పర్వతాల సుబ్రహ్మణ్యం, పామంజి బుచ్చిబాబు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బాలకృష్ణ నటజీవితం నవరస భరితం

పొదలకూరు, ఆగస్టు 30: సినీ హీరో బాలకృష్ణ నట జీవితం నవరసభరితమని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, ఆర్యవైశ్య నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక సినిమాహాల్‌లో బాలకృష్ణ సినీరంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు అయిన సందర్భంగా కేక్ కట్‌చేసి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

బకాయిలు సకాలంలో చెల్లించాలి

● ఖజానా అధికారుల తీరుపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30 : ఖజానా శాఖ అధికారుల వైఖరిని ఖండిస్తూ ఆర్టీసీ నెల్లూరు 1,2 డిపోల ఉద్యోగులు శుక్రవారం రెండో డిపో గ్యారేజీ గేటు వద్ద నిరసన తెలిపారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పీఎస్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు ఈ నెల జీతంలో కలపకుండా నిలిపివేసిన నైట్ అవుట్ అలవెన్స్‌ను ప్రభుత్వ జీవో ప్రకారం యథావిధిగా పునరిద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్ని రకాల అరియర్స్, సిక్ లీవులకు జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ట్రెజరీ శాఖ అధికారులు సకాలంలో పారదర్శకంగా చెల్లింపులు చేయాలని కోరారు. నాయకులు కే లుక్సన్, టీ మురళీ మోహన్‌రెడ్డి, సీహెచ్ చెంచయ్య, ఉదయ్‌శంకర్, పాల్గొన్నారు.

కార్పొరేషన్ సీపీ దేవీకుమారి బదిలీ

నెల్లూరు(సిటీ): నెల్లూరు కార్పొరేషన్‌లో సిటీ ప్లానర్‌గా పని చేస్తున్న దేవీకుమారిని బదిలీ చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులిచ్చింది. ఆమెను తుడా సీపీవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘల్ నుంచి గురువారం రాత్రి ఆదేశాలు కార్పొరేషన్‌కు అందగా అవి శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. నెల్లూరు సీపీగా ప్రస్తుతం ఏపీఐఐసీలో జేడీగా పని చేస్తున్న వీ కృష్ణకిషోర్‌ను నియమించారు. ఆయన డిప్యుటేషన్‌ను వెనక్కు తీసుకున్న ప్రభుత్వం నెల్లూరు కార్పొరేషన్‌కు బదిలీ చేసింది.

మున్సిపల్ షాపుల్లో బినామీలా!

● కార్పొరేషన్ అధికారులపై మంత్రి నారాయణ ఆగ్రహం

● సీజ్ చేసిన వాటి వివరాలివ్వాలని ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఆగస్టు 30 : నెల్లూరులో కార్పొరేషన్‌కు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్సుల్లో 223 దుకాణాలుంటే 52 దుకాణాలు బినామీలవిగా అధికారులు తేల్చడం, వాటిని సీజ్ చేయడం ఆశ్చర్యం కలిగించిందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులలో దుకాణాలను బినామీలు నిర్వహించడంపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి సమీక్ష జరిపారు. తాజాగా షాపింగ్ కాంప్లెక్సులలో సీజ్ చేసిన బినామీల షాపుల వివరాలు తనకు అందించాలని ఆదేశించారు. ఒకరు అద్దెకు తీసుకోవడం మరొకరు నిర్వహించడం సరికాదంటూ అధికారుల తీరును తప్పుపట్టారు. ఏళ్ల తరబడి షాపుల్లో ఉంటున్నవారిని బయటకు వెళ్లిపోమ్మనడం తగదన్నారు. ఈ అంశంపై సమగ్రంగా వివరాలు తెప్పించుకుని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి అందరికీ న్యాయం జరిగే విధంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

నిరాడంబరంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు 30 : తాను పాల్గొనే అభివృద్ధి కార్యక్ర మాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిరాడంబరంగా జరపాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరరెడ్డి సూచించారు. శుక్రవారం 20వ డివిజన్ పరిధిలోని సంఘమిత్ర స్కూల్ వద్ద సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆలయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలెవ్వరు ఫ్లెక్సీలు, శాలువాలు, బోకేలతో హడావుడి చేయవద్దని కోరారు. వాటికి ఖర్చయ్యే డబ్బును సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలని పిలుపు నిచ్చారు. తన సూచనతో తొలిసారిగా స్థానిక కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహించి నందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, వనమహోత్సవంలో భాగంగా కల్లూరుపల్లిలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ అరవ శాంతితో కలిసి మొక్కలు నాటారు. కార్పొరేటర్ చేజర్ల మహేష్, నాయకులు అరవ శ్రీను, సాయిబాబా, దారా మల్లి పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణస్వామి నిమజ్జనోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 30 : బాలాజీనగర్ పిండిమిల్లు సెంటర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక కృష్ణస్వామి నిమజ్జనోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. చిరంజీవి సేవా సమితి అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు, బాలాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. నిమజ్జనోత్సవం శోభాయాత్రను సీఐ సాంబశివరావు ప్రారంభించారు. కోలాటాలు, మేళతాళాలతో యాత్ర ఉత్సాహంగా సాగింది. అనంతరం పెన్నా ఘాట్ వద్ద నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజన్‌బాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో శ్రీకృష్ణుడి నిమజ్జన శోభాయాత్ర

కనుల పండువగా చిన్ననందిసేవ

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 30 : శ్రావణ శుక్రవారం సందర్భంగా మూలస్థానేశ్వరాలయంలో శివపార్వతులకు చిన్న వెండి నంది సేవ కనుల పండువగా జరిగింది. ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి నవావరణ పూజలు జరిగా యి. సాయంత్రం పూలంగిసేవ, నందీశ్వరునికి, మూలస్థానేశ్వరునికి విశేష అభిషేకాలు జరిగాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమాలను ఈవో, జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

● నగరంలోని స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలో గల ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి సామూహిక లక్ష కుంకుమార్చన కనుల పండువగా జరిగింది. పాల్గొన్న భక్తులకు లక్ష్మీదేవి వెండి కాసు, పసుపు కుంకుమ, రవిక, గాజులు అందజేశారు.

ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు ప్రారంభం

● 101 టెంకాయలు కొట్టిన జనసైనికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 30: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జిల్లాలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. పార్టీ జిల్లా పర్యవేక్షకుడు వేములపాటి అజయ్ సూచనలతో నాయకులు నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న పవన్‌కల్యాణ్ లక్ష్యం నెరవాలని కోరుకుం టూ 101 టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో గునుకుల కిషోర్ తదితర నాయకులు పాల్గొన్నారు. కాగా, పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల పోస్టర్‌ను జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పార్టీ నగర కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఆత్మకూరు బస్టాండు వద్ద చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చెత్త తొలగింపు, మొక్కలు నాటడం వంటివి చేస్తున్నామని తెలిపారు. మూడు రోజులు జరిగే ఈ వేడుకల్లో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం ముందు జనసేన పార్టీ నాయకులు

పొన్నవాహనంపై వేణుగోపాలుడు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 30 : నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ అవతార ఉత్సవాలు శుక్రవారం 4వరోజుకి చేరాయి. ఉదయం విశేష పూజలు, పూలంగిసేవ జరిగాయి. రాత్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం, వేణుగోపాలస్వామికి పొన్నవాహనం అలంకారంలో పేట ఉత్సవం జరిగాయి.

● రాజేంద్రనగర్‌లోని మురళీకృష్ణ మందిరంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో విశేష పూజలు, గరుడ వాహనంపై నగరోత్సవం వైభవంగా జరిగాయి.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి : ఎస్పీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం, ఎస్పీ క్యాంపు కార్యాలయం, పోలీసు గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. భావితరాలకు మనం అందించే ఆస్తి స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో దంత వైద్య శిబిరం

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 30 : నగరంలోని 47వ డివిజన్‌లో నారాయణ దంత వైద్య కళాశాల వారు శుక్రవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో దంత రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణ దంత వైద్య కళాశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి, డాక్టర్ శ్రావ్యశ్రీ, డాక్టర్ పావని, మహేశ్వరి, సాత్విక, దిలీప్, అబ్దుల్ రెహమాన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేస్తాం: ఏపీఆర్ఎస్ఏ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 30 : త్వరలో జరగబోయే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేస్తామని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగులు సాధారణ పరిపాలన, భూపరిపాలన, ప్రకృతి విపత్తులు, ఎన్నికల విధులు, ప్రోటోకాల్, జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం ఇతర శాఖల పనులు... ఇలా ఎన్నో విధుల్లో అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. కాగా, రెవెన్యూ ఉద్యోగులు చేయాల్సిన భూ రికార్డుల నవీకరణకు త్వరలో జరగబోయే రెవెన్యూ సదస్సుల ద్వారా ఒక మంచి అవకాశం రాబోతోందన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై హర్షం ప్రకటించారు.

ఫైర్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 30: ఫైర్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన నెల్లూరీయుడు చంద్రశేఖర్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. నెల్లూరు ఫైర్ స్టేషన్ లో అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అసోసి యేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎంపికైన రాజేంద్రప్రసాద్‌ను కూడా సత్కరించారు.



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది

మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం),ఆగస్టు 30: నగరంలోని బంగ్లాతోటలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. ఇందుకూరుపేట తూర్పువీధికి చెందిన పావని(30)కి అదే గ్రామానికి చెందిన కరుణాకర్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. దంపతుల మధ్య వివాదాలతో ఆమె భర్త నుంచి విడిపోయి నాలుగేళ్లుగా కుమారుడితో కలిసి నవాబుపేటలోని బంగ్లాతోటలో ఉంటోంది. ఒంటరితనం భరించలేక పోతు న్నానని, చనిపోవాలని అనిపిస్తోందని పలుమార్లు తల్లి పద్మకు చెప్పుకుని బాధపడేది. ఈ క్రమంలో ఈనెల 29వ తేదీ రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుంది. తల్లి శుక్రవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వినాయక విగ్రహాలు సిద్ధం







వినాయక చవితికి వివిధ వేషధారణల్లో విఘ్నేశ్వర విగ్రహాలు సిద్ధమయ్యాయి. పర్యావరణానికి హాని కలగకుండా మట్టి, పేపర్‌తో తయారుచేసిన విగ్రహాలను తిరుపతి సమీపం మంగళం పరిధిలోని బొమ్మల క్వార్టర్స్‌లో సిద్ధం చేశారు. దశాబ్దాలుగా వందల కుటుంబాలు ఈ విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు.వంద రూపాయల నుంచి 10వేల వరకు విగ్రహాలను రెడీ చేశారు.ఈ సంవత్సరం కొత్తగా ఖైరతాబాద్ తరహాలో వినాయకులను తయారు చేశారు. ఇప్పటికే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు 5వేల విగ్రహాలను పంపించారు.ఒక్క అడుగు నుంచి 18 అడుగుల వరకు విగ్రహాలను తయారు చేసి అమ్మకాలకు అందుబాటులో పెట్టారు. రూ.2,500 నుంచి రూ.లక్ష వరకు వీటి ధరలున్నాయని తయారీదారుల్లో ఒకరైన శ్రీ విఘ్నేశ్వర టెరికోట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల ప్రసాద్ తెలిపారు.ఈసారి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆర్డర్లు ఎక్కువ వచ్చాయన్నారు.

- మంగళం(తిరుపతి)

గాలేరు-నగరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 1వ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.కోదండరామిరెడ్డిని రాష్ట్రప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసింది. ఇదివరకూ ఓ రిట్ పిటిషన్‌కు సంబంధించి ఈయన హైకోర్టుకు కౌంటర్ అఫిడవిట్ సక్రమంగా దాఖలు చేయలేదని, దాంతో కోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ నివేదించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. కోదండరామిరెడ్డి గతంలో అన్నమయ్య జిల్లా రాజంపేట ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో అక్కడి గాలేరు-నగరి ప్రాజెక్టు భూసేకరణ విభాగం 4వ యూనిట్‌కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేశారు. అప్పట్లో భూసేకరణ వివాదానికి సంబంధించి కె.నాగిరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ (నంబరు 119-2022) దాఖలు చేశారు. ఈ కేసులో కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్‌ను సక్రమంగా దాఖలు చేయకపోవడంతో విచారణ సందర్భంగా హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. దీంతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో భాగంగా కోదండరామిరెడ్డి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసే సమయంలో ఆర్ అండ్ ఆర్ పాలసీ-2005, ఆర్ఎఫ్‌సీటీ ఎల్ఏ ఆర్ అండ్ ఆర్ యాక్ట్ -2013 చట్టాల్లోని అంశాలను విస్మరించారని, హైకోర్టుకు వాస్తవాలను వివరించడంలో విఫలమయ్యారని గుర్తించారు. ఈ కారణంగానే హైకోర్టు ఎదుట ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ప్రస్తుతం తిరుపతి జిల్లా గాలేరు-నగరి ప్రాజెక్టు 1వ యూనిట్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్బీఐ ఏటీఎంలో రూ.39 లక్షల చోరీ


ధ్వంసమైన ఏటీఎం

చంద్రగిరి, ఆగస్టు 30: చంద్రగిరి పట్టణం కొత్తపేటలోని కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం స్థానికులు ఏటీఎంలో చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ రామయ్య, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఏటీఎంను పరిశీలించి, వేలిముద్రల నిపుణులను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. వేలి ముద్రలు సేకరించిన అనంతరం సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా గురువారం రాత్రి 1.30 నుంచి 2.30 గంటల మధ్యలో ఓ దుండగుడు సెక్యూరిటీ గార్డు ముసుగులో ఏటీఎం రూములో చొరబడ్డాడు. ఏటీఎం డిజిటల్ పాస్‌వర్డ్‌ను కీ ప్యాడ్‌ను పగలగొట్టి అందులో ఉన్న రూ.39 లక్షల నగదును ఎత్తుకెళ్లాడు. ఏఎస్పీ నాగభూషణం, క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ కూడా ఏటీఎంను పరిశీలించారు.బ్యాంక్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటివరకూ ఏటీఎంలను గ్యాస్ కట్టర్‌తో పగులగొట్టి నగదును చోరీ చేసేవారు.ఈసారి డిజిటల్ లాక్ కీ ప్యాడ్‌ను పగలగొట్టి చోరీ చేయడం చూస్తుంటే ఇది ఏటీఎం టెక్నీషియన్ పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.చోరీ చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు చంద్రగిరి పోలీసులతో ఒక బృందాన్ని, తిరుపతి క్రైమ్ పోలీసులతో మరో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ నాగభూషణం తెలిపారు. చోరీ జరిగిన ఎస్బీఐ ఏటీఎంను ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం రాత్రి పరిశీలించారు.భద్రతా ఏర్పాట్లపై బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వలనే చోరీ జరిగిందంటూ అసహనం వ్యక్తం చేశారు.ఇకపై ఏటీఎంల వద్ద ఖచ్చితంగా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఎస్పీ రమణకుమార్, సీఐ రామయ్య ఉన్నారు.


సీసీ పుటేజీలో బయటపడ్డ చోరుడు


ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

జిల్లా ప్రత్యేకాధికారిగా సత్యనారాయణ

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రత్యేకాధికారిగా దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. అందులో భాగంగా తిరుపతి జిల్లాకు దేవదాయ శాఖ కమిషనర్‌గా పని చేస్తున్న 2006 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎస్.సత్యనారాయణను ప్రత్యేక అధికారిగా నియమించింది.జిల్లాలో మొత్తం కార్యక్రమాలను ఆయన తరచూ పర్యవేక్షిస్తూ సమీక్షిస్తూ సక్రమంగా అమలయ్యేలా కృషి చేయనున్నారు.

ముగ్గురు డీఎస్పీలకు పదోన్నతి


రామకృష్ణ


వెంకటాద్రి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ముగ్గురు డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ ద్వారకా తిరుమల రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సీఐ నుంచి డీఎస్పీ వరకు పనిచేసిన ఐ.రామకృష్ణ ఇంటెలిజెన్సులో పనిచేస్తున్నప్పటికీ డిప్యుటేషన్‌పై పోలీసు శిక్షణ కళాశాలలో డీఎస్పీగా ఉన్నారు. ఆయన అనుభవం, పరిపాలనా పరంగా తిరుమలలో శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమని భావించిన ప్రభుత్వం తిరుమల శాంతి భద్రతల ఏఎస్పీగా నియమించింది. అలాగే ఏఎస్పీగా పదోన్నతి పొందిన రవి మనోహరాచారి.. ఎస్ఐ క్యాడర్ నుంచి డీఎస్పీ వరకు చిత్తూరు, మదనపల్లె, తిరుపతి ఎస్బీ, సీఐడీ, ఇంటెలిజెన్సు, ఈస్ట్, తిరుపతి డీఎస్పీగా పనిచేశారు. మొన్న జరిగిన డీఎస్పీల బదిలీల్లో సీఐడీ విభాగానికి బదిలీ అవగా, ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. సెలవుపై ఉన్నారు. దీంతో ఆయన్ను తిరుపతి శాంతి భద్రతల విభాగానికి ఏఎస్పీగా బదిలీ చేశారు. ఇక రేణిగుంట డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటాద్రికి పదోన్నతి కల్పించిన ప్రభుత్వం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని పేర్కొంది. వారం కిందట తిరుపతి శాంతి భద్రతల ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాగభూషణరావును మళ్లీ తిరుపతి క్రైం అదనపు ఎస్పీగా నియమించింది.


రవిమనోహరాచారి


నాగభూషణరావు

ప్రతి ఒక్కరూ ఓ మొక్కనాటి సంరక్షించాలి

● కలెక్టర్ వెంకటేశ్వర్

మంగళం, ఆగస్టు 30: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కపిలతీర్థం వద్ద ఉన్న నగర వనంలో జరిగిన వనమహోత్సవంలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. నవంబరు మాసం వరకు ప్రతి ఒక్కరూ పర్యావరణ హితాన్ని కోరుతూ మొక్కలను నాటాలని కోరారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. మానవ మనుగడకు చెట్లు ఎంతో కీలకమని వాటిని నరకొద్దని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జేసీ శుభం భన్సల్, స్టేట్ సిల్వి కల్చరిస్టు యశోద బాయ్, జూపార్కు క్యూరేటర్ సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారి సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి మొక్కను నాటిన కలెక్టర్ వెంకటేశ్వర్

వినాయక మండపాలకు అనుమతి కావాలా?

● వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోండి

చిత్తూరు,ఆగస్టు 30: నాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలంటే ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని తీసుకొచ్చింది. 'గణేష్ ఉత్సవ్. నెట్' అనే వెబ్‌సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది,విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఏ రోజు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఏ వాహనం ద్వారా విగ్రహాన్ని తీసుకెళతారనే వివరాలను నమోదు చేసి, దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం 79950 95800 నెంబరు వాట్సాప్‌కు హాయ్ అని పెట్టాలి.అప్పుడు ఎన్‌వోసీ కోసం చేయాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా మొబైల్‌కు సమాచారం వస్తుంది. అలాగే దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్‌కు వెళుతుంది. ఆ అధికారులు మండప ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌వోసీ జారీ చేస్తారు. నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసుకుని మండపాల్లో ఉంచాలి. పోలీసు అధికారులు సందర్శనకు వచ్చినప్పుడు క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసి తనిఖీ చేస్తారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి



సూచనలిస్తున్న ఎంపీడీవో రజనీకాంత్

ఓజిలి, ఆగస్టు 30: పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు భాగస్వాములని ఎంపీడీవో రజనీకాంత్ అన్నారు. ఓజిలిలోని విద్యావనరుల కేం ద్రంలో శుక్రవారం ఎంఈవో శైలజ అధ్యక్షతన ఎస్‌ఎంసీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లకు జరిగిన ప్రత్యేక అవగాహన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడు తూ... పాఠశాలలో విద్యతోపాటు మౌలిక సదుపాయాల కల్పనలో ఎస్‌ఎంసీ ల పాత్ర కీలకమన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయాలన్నారు. ఈవోపీఆర్డీ మోహన్ పాల్గొన్నారు. అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్ పిలుపు మే రకు ఎంఈవో కార్యాలయం వద్ద శుక్రవారం అధికారులు మొక్కలు నాటారు.

గిట్టుబాటు ధర కల్పించండి



గిట్టుబాటు ధర కోసం ఆక్వా రైతుల నినాదాలు

గూడూరు, ఆగస్టు 30: తమకు ప్రభుత్వం గిట్టు బాటు ధరలు కల్పిం చాలని డివిజన్‌లోని ఆక్వా రైతులు అన్నారు. శుక్ర వారం స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆక్వా రైతుల డివిజన్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... గిట్టుబాబు ధర లు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. రొయ్యల ఎగుమతి దారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గిస్తుండడంతో నష్టాలు చవిచూ డాల్సి వస్తోందన్నారు. నాసిరకం సీడ్, ఫీడ్ విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం ఆక్వారంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనాథ రెడ్డి, కాలేషా, మనోహర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాలక్ష్మి హోమం



సూళ్లూరుపేట, ఆగస్టు 30: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శుక్ర వారం మహాలక్ష్మి హోమం ఘనంగా జరి గింది. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో హోమగుండం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ మహాలక్ష్మి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ముందుగా మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రాకారోత్సవం నిర్వహిం చి హోమగుండం ఎదుగా కొలువుదీర్చి హోమం నిర్వహించారు. గాదిరెడ్డి సుధాకర్ రెడ్డి, కవిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సమాచారలోపంతో అంత్యక్రియలకు ఏర్పాట్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 30: సమాచారలోపంతో అంత్యక్రియలను ఏ ర్పాటు చేసిన సంఘటన పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు పట్టణంలో నివాసం ఉంటున్న ఓ యువకుడు లివర్ దెబ్బతిని నెల్లూరులోని ఓ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నాడు. ఈ క్రమంలో వైద్యశాలలో ఆ యువకుడితో ఉన్న వ్యక్తి నాయుడుపేటకు ఫోన్‌చేసి ఆ యువకుడు మృతి చెందినట్లు తప్పుడు సమాచారం అందించాడు. అదే సమయంలో ఆ యువ కుడు కుటుంబసభ్యులు నాయుడు పేట పట్టణంలో దహనసంస్కారాలకు ఏర్పాటు చేసేశారు. కొంత సమయం తరువాత ఆ యువకుడు బతికే ఉన్నట్లు సమాచారం రావడంతో ఏర్పాట్లను ఆపేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తడ, ఆగస్టు 30: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని సుజాత నగర్‌కు చెందిన బి.రాజా తమిళనాడు గుమ్మడిపూండిలోని ఓ పరిశ్రమలో, భార్య మీనా శ్రీసిటీ సెజ్‌లో ఓ పరిశ్రమలో పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో భార్య, భర్తలిద్దరూ రోజు మాదిరిగానే శుక్రవారం కూడా ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న 7 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారికి 16 ద్విచక్ర వాహనాల విరాళం



ఈవో, అదనపు ఈవోకు వాహనాల తాళాలను అందిస్తున్న వేణుసుదర్శన్

తిరుమల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం 16 ద్విచక్ర వాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్ మోటార్స్ ఎండీ వేణుసుదర్శన్ ఈ వాహనాలను అందజేశారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనాలకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం దాత వారికి వాహనాల తాళాలను అందజేశారు. 16 ద్విచక్ర వాహనాల్లో 15 ఎలక్ట్రికల్ వాహనాలు ఉన్నాయి. వీటి ధర దాదాపు రూ.22 లక్షలు అని సంస్థ ప్రతిని ధులు తెలిపారు.

డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు

గూడూరు, ఆగస్టు 30: గూడూరు డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రమణకుమార్‌ను శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరా మన్నారు. కార్యక్రమంలో ఏ.బాలకృష్ణమనాయుడు, దయాకర్, శ్రీనివాసరావు, సురేష్‌బాబు, ప్రభాకర్, సురేష్, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పెళ్లకూరు, ఆగస్టు 30: మండలంలోని పునబాక, శిరసనంబేడు గ్రామాల్లో శుక్రవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము, గర్భాశయం ముఖద్వారా పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు డాక్టర్ చైతన్యభాను, పద్మావతి తెలిపారు. సెప్టెంబర్ 2న తాళ్వాయిపాడులో, 4న కానూరు, 6న బంగారంపేటల్లో ఉచిత శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యులు తెలిపారు. పెళ్లకూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు సుజాత, ఉమ , సర్పంచులు జి.పెంచలయ్య, చిత్ర పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

గూడూరు, ఆగస్టు 30: ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిందన్నారు.

నాయుడుపేట టౌన్: ఏకీకృత పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధంచాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. నాయుడు పేట తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలియజేశారు. అనంతరం డీటీ రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు.

సూళ్లూరుపేట: యూనిఫైడ్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు.

కోట: పాత పెన్షన్ విధానం తప్ప మిగతా ఏ విధానాన్ని ప్రభుత్వాలు ప్రవేశపెట్టినా ఒప్పుకునే ప్రసక్తేలేదని యూటీఎఫ్ నాయకులు హెచ్చ రించారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

డక్కిలి, ఆగస్టు 30: విద్యతోనే లక్ష్యాన్ని చేరుకోవ చ్చని డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శుక్ర వారం డీకేఎం డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... ర్యాగింగ్ చట్టరీత్యా నే రమన్నారు.అనంతరం ఆయన మండలంలోని మాధవ య్యపాళెంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్నారు. పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెం దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

అన్నదానం

వెంకటగిరిటౌన్, ఆగస్టు 30: డిప్యూటీ సీఎం పవణ్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఎంపీడీవో కా ర్యాలయం వద్ద జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదానం జరి గింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శేఖర్, బాబి, రాజా తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో బాక్స్ టైపు అండర్ బ్రిడ్జి నిర్మాణం

కాంట్రాక్టర్, అధికారుల హామీ ● శాంతించిన పెరియవట్టువాసులు





పెరియవట్టువాసులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు - పట్టాలపైకి గ్రామస్తులు రాకుండా మోహరించిన పోలీసులు

తడ, ఆగస్టు 30: బాక్స్ టైపు అండర్ బ్రిడ్జిని నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. మండలంలోని పెరియవట్టు వద్ద అర్థంతరంగా ఆగిపోయిన బాక్స్ టైపు బ్రిడ్జిని పూర్తి చేసి రాకపోకలకు అనుమతించాలంటూ కొద్దిరోజు లుగా గ్రామస్తులు అధికారులకు మొర పెట్టు కుంటున్నారు. వారు పట్టించుకోకపోవడంతో శుక్రవారం బ్రిడ్జి నిర్మాణ స్థలం వద్ద ధర్నాకు ది గారు. ధర్నా విషయం ముందుగా అధికారులకు తెలియడంతో శుక్రవారం ఉదయం 6 గంటలకే స్థా నిక పోలీసులు రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ రైల్వేగేట్ వద్దకు చేరుకున్నారు. గ్రామానికి వెళ్లి ధర్నా విర మించుకోవాలని గ్రామస్తులతో చర్చించారు. గ్రామ స్తులు ససేమిరా అంటూ బ్రిడ్జి నిర్మాణ స్థలం రైల్వే ట్రాక్ పక్కనే టెంట్లు వేసి ధర్నాకు దిగారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు రైల్వే పట్టాలపైకి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో సీఐ మురళీకృష్ణ, తహసీల్దారు శరత్ బాబు, ఎంపీడీవో విజయకుమార్ సంఘటనా స్థలా నికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఈ లోపు రైల్వే కాంట్రాక్టర్ అక్కడికి చేరుకుని వెంటనే పనులు మొదలుపెట్టి 6 నెలల్లో పూర్తిచేస్తామని తెలి పినా గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు. అధికా రులు కల్పించుకుని నాలుగు నెలల్లోపు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా కాంట్రాక్టర్, రైల్వే అధికారులను ఒ ప్పించారు. దీంతో గ్రామస్తులు శాంతించారు. చెన్నై ఆర్పీ ఎఫ్ ఏఎస్‌ఈ రాజయ్య, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు భూమి నాథన్, గోపీరాజు, సదరన్ రైల్వే డిప్యూటీ ఇంజనీర్ వికాష్‌జయదేవ్, ఏడీఈ మురారికుమార్, ఎస్‌ఐ కొండపనాయుడు తదితరులు ఉన్నారు.

పొట్టకూటి కోసం వెళ్లి మంగళూరులో మృత్యువాత

గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో విషాదఛాయలు





మహేంద్ర (ఫైల్‌ఫొటో)- మహేంద్ర మృతదేహం

కోట, ఆగస్టు 30: తరతరాలుగా కడలి తల్లిని నమ్ముకుని అందులోని చేపలను పట్టుకుని కుటుంబాలను పోషించుకుంటూ వస్తున్న మత్స్య కారులకు రెండేళ్లుగా కడలి కన్నెర్ర చేసింది. ఆంధ్రా సముద్ర భూభా గంలోకి తమిళ జాలర్లు అక్రమంగా చొచ్చుకొని వచ్చి ఖరీదైన బోట్లతో సముద్రంలో పెద్ద చేపలను మొదలుకొని జల్ల వరకు గద్ద తన్నుకుని వెళ్లినట్లు వెళ్తున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని కోట, వాకాడు మండలాల మత్స్యకారులు పిడికెడు మెతుకుల కొరకు పొట్ట చేత పట్టుకొని కర్ణాటకలోని మంగళూరులో కూలి ప్రాతిపదికన సముద్రంలోకి చేపలు పట్టేందుకు వెళ్లారు. అక్కడ సముద్రం కన్నెర్ర చేసింది. గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామానికి చెందిన వావిళ్ల మహేంద్ర(25) మంగళూరు సముద్రంలో గల్లంతై విగత జీవియై ఒడ్డుకు చేరడంతో ఒక్కసారిగా ఇక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రిని కోల్పోయిన ఆకు టుంబ బాధ్యతలు మోస్తున్న కుమారుడి మృతితో ఆ తల్లి గుండెలవిసేలా రోదిస్తుండగా ఇద్దరు చెల్లెళ్లు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు.

కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని గోవిందపల్లిపాళెం మత్స్య కార గ్రామానికి చెందిన 30 మంది మత్స్యకారులు 20 రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు సముద్రంలో కూలి ప్రాతిపదికన చేపల వేటకు వెళ్లారు. ఆయా మత్స్యకారులంతా నిరుపేదలు కావడంతో అక్కడే చేపలుపట్టి అక్కడి యజమానులు కూలీగా ఇచ్చిన నగదును వారివారి ఇళ్లకు పంపి కుటుంబా లను పోషిం చు కుంటూ వ స్తున్నారు. ఈ నేప థ్యం లో తమ ప నుల్లో భా గం గా గోవింద పల్లి పాళెంకు చెందిన వావిళ్ల మహేంద్ర సముద్రంలో బోట్‌లో చేపల వేటాడుతూ ప్రమా దవశాత్తు గురువారం తెల్లవారు జామున సముద్రంలో పడిపోయాడు. సహచర మత్స్యకారులంతా గల్లంతైన మహేంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టినప్పటికి ఆచూకి లభ్యం కాలేదు. శుక్రవారం తెల్లవారుజామున మహేంద్ర మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. దీంతో సహచర మత్స్యకారులు స్వగ్రామమైన గోవిందపల్లిపాళెంకు సమాచారం ఇవ్వడంతో మత్స్యకారులంతా శోక సముద్రంలో మునిగి పోయారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు మహేంద్ర తల్లీచెల్లెళ్లు బోరున విలపిస్తూ మంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



సూళ్లూరుపేట, ఆగస్టు 30: కాళంగి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రా క్టర్లను శుక్రవారం తెల్లవారు జా మున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక విధానం అమల్లోకి రాడంతో కాళంగి నదిలో ఇసుక తవ్వకాలు నిషేధించారు. అయినా అక్ర మార్కులు కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో రాత్రివేళల్లో అక్రమంగా రియల్ ఎస్టేట్ భూములకు తరలిస్తున్నారు. గురువారం రాత్రి పోలీసులకు కాళంగి నదిలో ఇసుకను తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో ఇలుపూరు సమీపంలో ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు మా ట్లాడుతూ.. కాళంగిలో ఇసుకను ఎవరు తరలించినా చర్యలు తప్పవన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండండి

పెళ్లకూరు, ఆగస్టు 30: గ్రామీణ ప్రాంతాల్లో హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, జిల్లా ప్రోగాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో అక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం కానూరు సచివాలయ పరిధిలో ఏఎన్‌ఎం, ఆశావర్కర్ తదితర వైద్య సిబ్బందితో కలసి ఇంటింటికీ వైద్యసేవలపై ఆరా తీశారు. డీపీఎంవో శ్రీనివాసరావు, జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, డీపీవో ప్రకాష్, డీపీహెచ్‌వో బేబీరాణి, చెంబేడు వైద్యాధికారి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనం రుచిగా ఉండాలి

● గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఎమ్మెల్యే సూచన



వంట నిర్వాహకురాలికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే

ఓజిలి, ఆగస్టు 30: విద్యార్థులకు మంచి వాతా వరణం కల్పించడంతో పాటు భోజన పదార్థాలు రుచిగా, వంట వండే ప్రాం తం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ సూ చించారు. మండలం లోని చిల్లమానుచేను గురుకుల పాఠశాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు, డార్మెటరీలను పరిశీలించారు. అనం తరం వంటశాల, డైనింగ్ రూంను తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిప్రకాశ్‌తోపాటు వంట నిర్వాహకురాలితో మాట్లాడారు. వి ద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే తొలుత మంచి వాతావరణం ఉండాలని అదే సమయంలో వారికి అందించే భోజనం రుచిగా ఉండాలన్నారు. ముఖ్యంగా చికెన్ ఇతర మాంసాహారం వండేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. అనంతరం ఆమె చిల్లమానుచేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లను తనిఖీ చేశారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకట సుబ్బయ్య, పార్టీ మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు, కార్యదర్శి నిరంజన్, నాయకులు బి.రవీంద్రారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జిలు పి.ప్రకాశ్ నాయుడు, కె.సత్యవరప్రసాద్‌రావు, తెలుగుమహిళ నేత పవిత్రారెడ్డి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

చెట్లతోనే మానవజాతి మనుగడ







గూడూరు, సూళ్లూరుపేటల్లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యేలు పాశం సునీల్, విజయశ్రీ - వెంకటగిరి పట్టణంలోని నగరవనంలో వనమహోత్సవం

గూడూరు, ఆగస్టు 30: మానవజాతి మనుగడకు చెట్లు ముఖ్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నాయుడుపేట రేంజ్ గూడూరు సెక్షన్ అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెట్లు అధికంగా ఉన్న ప్రాంతంలో ఆక్సిజన్ లభించడంతోపాటు వర్షాలు కురుస్తాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అనేక చెట్లను నరికివేసిందన్నారు. టీడీపీ నాయకులు పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం,అటవీశాఖ అధికారులు జ్ఞానప్రకాష్, రమణయ్య, కోటేశ్వరరావు, మురళి, రవి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం భారతి, ఎస్‌ఐ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పర్యావరణాన్ని పరిరక్షన పచ్చని చెట్లతో సాధ్యమని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, వి.రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకర్ శర్మ, డీఎఫ్‌వో శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పచ్చని చెట్లు ప్రగతికి సోపానాలని టీడీపీ స్థాపించనప్పటినుంచి నినదిస్తున్నట్లు తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే పసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ పి.రాజేశ్వరరావు అన్నారు. గురువారం తిరుపతి రోడ్డులోని నగరవనంలో వనమహోత్సవం నిర్వహిం చారు. ఆకుపచ్చని ఆశయాలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తోడ్పడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనూజా రెడ్డి, అటవీశాఖ రేంజర్ రాజేంద్రసాద్, ఎంపీడీవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని లోతువానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు వనమహోత్సవ ప్రతిజ్ఞ చేశారు.

నాయుడుపేట: పర్యావరణ పరిరక్షణకు చెట్లే మూలాధారమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. పట్టణంలోని బీఎంఆర్ నగర్‌లో శుక్రవారం టీడీపీ నాయకులతో కలసి మొక్కలను నాటారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్‌రెడ్డి, రఫి, శోభారాణి, మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీఉన్నత పాఠశాలలో, పున్నపువారిపాళెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. పున్నపువారిపాళెం ప్రాథమిక పాఠశాలలో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. అదేవిధంగా విద్యార్థులు యూనిఫాం కుట్టించుకునేందుకు రూ.10 వేలు అందజేశారు.

వాకాడు: మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల లో వనమహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దారు రామయ్య హాజరయ్యారు.ఏపీవో విజయమ్మ, వైస్ ప్రిన్సిపాల్ విజయకుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రమణ్యంరాజు

గూడూరు, ఆగస్టు 30: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరి ష్కరించాలని ఎం ప్లాయిస్ యూ నియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ సుబ్ర మణ్యం రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగల భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు నాలుగు నెలలుగా రావాల్సిన నైట్, డేఅవుట్ అలెవెన్సులు కలపాలన్నారు. విద్యార్హత లేని డ్రైవర్లుకు రాష్ట్ర మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం నైపుణ్య పరీక్షలు పెట్టి ఇంక్రిమెంట్లను అందించాలన్నారు. డిపో ఆవరణలో పురుషులకు రెస్టరూంను ఏర్పాటు చేయాలన్నారు. గూ డూరు నుంచి తిరుమలకు సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. అనం తరం గూడూరు డిపో ఈయూ అధ్యక్షుడిగా వై.వీ .నారాయణ, కార్యదర్శిగా చెంగ య్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మీరయ్య, ట్రెజరర్‌గా జిలానీబాషాతోపాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

చెంగాళమ్మ ఆలయంలో వైభవంగా పుష్పయాగం



సూళ్లూరుపేట, ఆగస్టు 30: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శ్రావణమాస చివరి శుక్రవాకారింర పురస్కరించుకుని పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పా టు చేసి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ చెన్నై నుంచి తెప్పించిన రకరకాల పుష్పాలతో అమ్మవారికి పుష్పార్చన చేశారు. భక్తులు పుష్పాలను అమ్మవారిని పాదాల చెంతకు చేర్చి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పుష్పయాగానికి తెచ్చిన పుష్పాలను ఆలయ చుట్టూ ప్రదర్శనగా తీసుకెళ్లి అమ్మవారి పాదాల చెంతపెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆస్థాన మండపం వద్దకు తీసుకొచ్చి పుష్పయాగం నిర్వహించారు. ఉభ య కర్తలుగా చెన్నైకి చెందిన ఏ.మోహన్‌రావు, సులోచన, మనోజ్‌సాయి, లత దంపతలు వ్యవహరించారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసబాబు ఉభయకర్తలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పుష్పయాగం అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. పుష్పయాగంలో ఎమ్మెల్యే విజయశ్రీ, చెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ డి.బాలచంద్రా రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏ.జి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణ డీలర్లతో సమీక్ష

కోట, ఆగస్టు 30 : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం చౌకదుకాణ డీలర్లతో తహసీల్దారు జయజయరావు, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దారు సంధ్య సమీక్ష జరిపారు. మండలంలోని 33 రేషన్ దుకాణాల ద్వారా 21 పంచాయతీల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సరఫరా చేయాలని డీలర్లకు సూచించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు అర్బన్, ఆగస్టు 30: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని జేవీవీ పట్టణాధ్యక్షుడు వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం రాత్రి ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జాతీయ క్రీడా దినో త్సవాన్ని పురస్కరించుకుని వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యాన్‌చంద్‌ను ఆ దర్శంగా తీసుకుని క్రీడాకారులుగా రాణించాలన్నారు. డాక్టర్ బ్రహ్మయ్య, హాకీ కోచ్ దీపక్‌ఆకాష్, నాగరాజు, చంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 30: స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాల యంలో శుక్రవారం మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావ సరాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు చేయూతనందించేలా తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శ్రీనివాసులు, శివకుమార్, నాగరాజు, కుమార్, రామ్మోహన్‌రావు, నాగేంద్ర పాల్గొన్నారు.

సిబ్బంది వివరాల సేకరణ

గూడూరు అర్బన్, ఆగస్టు 30: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏసీబీ సిబ్బంది వివరాలు సేకరించారు. సాధారణ పరిశీలనలో భాగంగా వివరాలు పరిశీలించినట్లు తెలిపారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు





సారె తీసుకువస్తున్న ఎమ్మెల్యే - పుష్పాలంకరణలో పోలేరమ్మ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 30: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద కొలువై ఉన్న గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్ర వారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణ శుక్రవారం వారం పుర స్క రించుకుని ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వ హించారు. సాయంత్రం ఎమ్మెల్యే విజయశ్రీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృతసరళ దంపతులు అమ్మవారికి సారె అందజేశారు. ఈవో శశాంక్, టీడీపీ నాయకులు ఎం.రాజశేఖర్, పెసల కిషోర్‌బాబు, విజయకుమార్‌నాయుడు, కుబేరు మణి, గంగాప్రసాద్, చక్రపాణి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలి

వాకాడు, ఆగస్టు 30: ఎస్సీ ఎస్టీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దారు రామయ్య ఆదేశించారు.. మండలంలోని దుగరాజపట్నం హరిజనవాడలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి వివరించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్ల శ్మశాన సమస్యకు పరిష్కారం



చిట్టేడులో జరిగిన భూ సర్వే

కోట, ఆగస్టు 30: మండలంలోని చిట్టేడు పంచాయతీలోని అంకమ్మమిట్ట ఎస్టీలు శ్మశానం కోసం పాతికేళ్లుగా పోరాడు తున్నారు. ఈ సమ స్యకు రెవెన్యూ అధికా రులు శుక్రవారం పరి ష్కారం చూపారు. అం కమ్మమిట్టలో 30 కుటుం బాల వరకు ఎరుకుల సామాజికవర్గం నివాసం ఉంటోంది. అయితే ఈ సామాజిక వర్గంలో ఎవరైన చనిపోతే ఎక్కడపడితే అక్కడ దహనక్రియలు చే స్తున్నారేతప్ప శాశ్వత శ్మశానవాటిక లేదు. రెండు రోజుల క్రితం ఒకరు చనిపోగా మృతదేహాన్ని పూడ్చేందుకు పొలాల వద్ద ప్రయత్నించగా రైతులు నిరాకరించారు. సమస్య తెలుసుకున్న తహసీల్దారు జయజయరావు, సర్వేయర్ రామ్‌కుమార్‌రాజు, వీఆర్వో సుబ్రహ్మణ్యం సర్వే నిర్వహించి 30 సెంట్ల ప్రభుత్వ భూమిని శ్మశానవాటికకు కేటాయించారు.

జీతాలు చెల్లించండి

గూడూరు, ఆగస్టు 30: స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేసే పారి శుద్య కార్మికులకు జీతాలను చె ల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ షరీనాకు వినతి పత్రం అందజేశారు. నాలుగు నెల లుగా జీతాలు సక్రమంగా ఇవ్వక పోవడంతో వారు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతినెల జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, ఆగస్టు 30 : మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం గ్రీన్‌ల్యాంబ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ ప్రాంగణ ఎంపికలకు ఇక్కడ డిగ్రీ కళాశాలలో విద్య అభ్యసించిన 47 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 19 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, ప్రాంగణ ఎంపికల అధికారి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.